3 నుంచి కనకమహాలక్ష్మి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు



వన్‌టౌన్, న్యూస్‌టుడే: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 3న ఆదిలక్ష్మి-లక్ష కుంకుమార్చన, 4న ధనలక్ష్మి-లక్ష వామంతుల పూజ, 5న ధాన్యలక్ష్మి-లక్ష్మి పూజ, 6న ధైర్యలక్ష్మి- తులసీ పూజ, 7న సంతాన లక్ష్మి-కలువపూల పూజ, 8న విజయలక్ష్మి-గులాబీల పూజ, 9న విద్యా లక్ష్మి-శ్రీ పుష్పయాగం, 10న గజలక్ష్మి-లక్ష గాజుల పూజ, 11న మహాలక్ష్మి-కుంకుమ పూజ, 12న కనకమహాలక్ష్మి-స్వర్ణాభరణ అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. మూలవిరాట్‌కు అభిషేకాలు చేస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం పంచామృత అభిషేకం, మంగళ, శుక్ర, ఆదివారాల్లో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, క్షీరాభిషేకం, సహస్ర తులసీ దళార్చన, ఇతర సేవలు నిలుపుదల చేస్తామని, గర్భాలయ దర్శనాలు ఉండబోవని ఈఓ పేర్కొన్నారు.

కిరండూల్ రైళ్లకు అదనపు విస్టాడోమ్, ఏసీ ఎకానమీ బోగీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-కిరండూల్-విశాఖ రైళ్లకు అదనంగా ఒక విస్టాడోమ్(అద్దాలు), థర్డ్ ఏసీ ఎకానమీ బోగీలను జత చేయనున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్(08551) రైలుకు అక్టోబరు 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19 తేదీల్లో.. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ (08552) రైలుకు 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20 తేదీల్లో అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తారు. ★ విశాఖ-కిరండూల్ (08551) రైలుకు ఈనెల 2,4,6,8,10,12,14,16,18,20 తేదీల్లో.., తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ (08552) రైలుకు ఈనెల 3,5,7,9,11,13,15,17,19,21 తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తారు.

గుండె మండిన జనం



ఉదయం 8గంటలకు: ఉద్యోగుల నివాస సముదాయం విజయనగర్‌కాలనీ గేటు నుంచి విస్తరించి ఉన్న ఉద్యోగుల కుటుంబీకులు

సింధియా, న్యూస్‌టుడే

విశాఖ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగుల కుటుంబాలు రోడ్డెక్కాయి. తమ కష్టాలను పరిష్కరించాలని సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. ఏళ్ల తరబడి సేవలందించిన పోర్టు ఆధ్వర్యంలోని డాక్‌యార్డ్ వంతెనను మరమ్మతుల నేపథ్యంలో తొమ్మిది నెలల పాటు మూసివేస్తున్నట్లు అధికారులు ఇటీవల ప్రకటించారు. కొద్ది రోజులుగా మరమ్మతుల సాగుతుండటంతో నిత్యం వేలాది మంది చుట్టూ తిరిగి(రానుపోను 13 కి.మీ.అదనంగా) రాకపోకలు సాగిస్తున్నారు. డాక్‌యార్డ్ లోపలి నుంచి రాకపోకలకు అనుమతివ్వాలని అభ్యర్థించినా దేశ రక్షణ ప్రాజెక్టులున్నందున అధికారులు నిరాకరించడంతో ఆందోళనకు దారి తీసింది.

★ దగ్గర దారిలో అనుమతించాలని ఉద్యోగుల ఆందోళన

★ దేశ రక్షణ ప్రాజెక్టులున్నందున కుదరదంటున్న నేవీ అధికారులు

ఇలా ఆందోళన ఆరంభం...

గత నెల 27న డాక్‌యార్డు నుంచి ఇంటికి వెళ్తున్న ఉద్యోగి ఒకరు షీలానగర్ బోర్ట్ గేటు వద్ద లారీ ఢీకొని మృత్యువాతపడ్డాడు. ఆ రోజు రాత్రే ఉద్యోగులంతా డాక్‌యార్డు గేటు వద్ద ఆందోళనకు దిగారు. దీంతో ఆందోళన ఉద్ధృతంగా మారి ..సోమవారం ఉదయానికి మరింతగా పెరిగిపోయింది.

ఉదయం 7 గంటలకు

డాక్‌యార్డు ఉద్యోగుల భార్యలు కొంత మంది విజయనగర్ గేటు వద్దకు చేరుకుని గేట్లకు అడ్డుగా నిలబడి ప్లకార్డులతో నిరసనకు దిగారు. అదే సమయంలో ఉద్యోగులు రోజూ మాదిరిగానే లోపలికి వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను సాగనివ్వలేదు.



డాక్‌యార్ట్ గేటు నుంచి గోదాముల వరకు రోడ్డుపై ఆందోళనకారులు



ఉదయం 7గంటలకు: విజయనగర్ గేటు వద్ద డాక్‌యార్డు ఉద్యోగుల భార్యలు

ఉదయం 8 గంటలకు డాక్‌యార్డు గేటు వద్ద ఆందోళన సమాచారం తెలిసి విజయనగర్ కాలనీ, 104ఏరియా, పరిసర ప్రాంతాల్లో ఉన్న డాక్‌యార్డు ఉద్యోగుల భార్యలు, పిల్లలతో సహా మూకుమ్మడిగా గేటు వద్దకు చేరుకుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మధ్యాహ్నం వరకు.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విజయనగర్ గేటు నుంచి గోదాముల వరకు ఉన్న సేవా రహదారి మొత్తం దిగ్బంధం చేశారు. లోపల యాజమాన్యం కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించింది. డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్(ఏఎస్‌డీ)గా రెండు రోజుల కిందటే చేరిన శ్రీనివాస్ చర్చలు జరిపారు. నాలుగైదు రోజుల గడువు ఇవ్వాలని కోరారు. ఈ సమాచారాన్ని కార్మికసంఘాల ప్రతినిధులు గేటు బయటకొచ్చి నచ్చజెప్పినా ఆందోళనకారులు వినలేదు.

సాయంత్రం ఇలా.. సాయంత్రం ఆరుగంటలకు కూడా ఆందోళన విరమించలేదు. తక్షణం షిప్‌బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వంతెన ద్వారా అనుమతి ఇవ్వాలని, చుట్టూ తిరిగి రాకపోకలు సాగించి ప్రమాదాల్లో మా కుటుంబ సభ్యుల ప్రాణాలు పోతే ఎలా బతకాలని మండిపడ్డారు. **చివరికి అక్టోబర్ మూడో తేదీ వరకు వేచి చూస్తామని లేకుంటే పోరు సాగిస్తామన్నారు.**



ఉదయం 9గంటలకు: డాక్‌యార్డు గేటు వద్ద పెద్దఎత్తున ఆందోళన

అనుమతి నిరాకరణకు కారణాలు ఇవీ...

» ఆందోళనకారులు కోరుతున్న ఎస్‌బీసీ వంతెన పక్కనే ఒక వైపు దేశ రక్షణ అవసరాల దృష్ట్యా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత అణు జలాంతర్గాముల స్థావరాలు ఉన్నాయి. మరో వైపు యుద్ధనౌకల మరమ్మతుల విభాగాలు ఉన్నాయి.

» శాశ్వత ఉద్యోగులకు వంతెన ద్వారా అనుమతిస్తే భవిష్యత్తులో వేలాది కాంట్రాక్టు కార్మికులకు కూడా అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

» పారిశ్రామిక ప్రాంత వాసులను వైద్యపరమైన అత్యవసరాల నిమిత్తం నగరానికి తీసుకువెళ్లాల్సి వస్తే ఎస్‌బీసీ లోపల నుంచే అనుమతి ఇవ్వాలని డిమాండ్ ఉన్నా 'రక్షణ' అంశాల దృష్ట్యా ఒప్పుకోలేదు.

» **30 శాతమే హాజరు:** సోమవారం ఒక్కసారిగా ఆందోళన తెరపైకి రావడంతో కొంత మంది ఉద్యోగులు షిప్యార్డులోకి కూడా పరిసరాల నుంచి ఉన్న గేట్లు, అలాగే కాలినడక గేట్ల ద్వారా సంస్థలోపలికి వెళ్లగలిగారు. దాదాపు నాలుగు వేల మంది ఉద్యోగులకుగాను 30 శాతం మందే హాజరైనట్లు ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

» **బందోబస్తు:** ఈ ఆందోళన వివరికి ఎటు దారితీస్తుందోనని భావించి లోపల నౌకాదళ సిబ్బంది, బయట గేట్ల వద్ద సాధారణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మల్కాపురం సీఐ ఎస్. విద్యాసాగర్ పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సిబ్బందిని మోహరించారు.

జిల్లాలో కొత్తగా 43 పోలింగ్ కేంద్రాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్తగా 43 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని కలెక్టర్ హరేంధిరప్రసాద్ చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1941 కేంద్రాలు ఉన్నాయని, 1500 ఓటర్లు దాటిన చోట కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదించి ఈసీకి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపక్షాలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి అవసరాలు, స్థానిక విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని 31 కేంద్రాలకు స్థానచలనం, 12 కేంద్రాల పేర్లు మార్పు, నాలుగు కేంద్రాలను మిళితం చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆయా ప్రతిపాదనలను ఈసీ ఆమోదిస్తే తదుపరి కార్యాచరణ చేపడతామని తెలిపారు.

15రోజుల్లో వీధి దీపాలన్నీ వెలగాల్సిందే.. గుత్తేదారుకు కమిషనర్ ఆదేశాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో వీధి దీపాల నిర్వహణ తీరుపై కమిషనర్ సంపత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి 2 గంటల వరకు జోన్-3,4,5,8లలో పర్యటించారు. ఎక్కడికక్కడ వెలగని దీపాలను గమనించిన ఆయన గుత్తేదారుతో మాట్లాడారు. 15 రోజుల్లో దీపాలన్నీ వెలగాలని, పూర్తిగా పాడైన చోట 30 రోజుల్లో కొత్తవి వేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా నెలల తరబడి గుత్తేదారు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే నోటీసు జారీ చేశామని, పరిస్థితిలో మార్పు రాకపోతే గుత్త సంస్థతో ఒప్పందం రద్దు చేసుకుంటామని పేర్కొన్నారు.



వీధి దీపాల వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు శ్రీకారం

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



రాజకీయ పక్షాల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపక్షాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయుల ఓటరు జాబితా తయారీకి శ్రీకారం చుట్టిందన్నారు.

★ ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో 34 మంది ఈఆర్వోలు, 187 మంది ఏఈఆర్‌ఓలను నియమించామని, ఈఆర్ఓగా విశాఖ జిల్లా డీఆర్వో వ్యవహరిస్తారని చెప్పారు. అర్హులైన ఉపాధ్యాయులు అధికారులకు ఓటు దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో సీఈఓ ఆంధ్ర వెబ్‌సైట్‌లో ఫారం 19ను పూర్తి చేసి సమర్పించవచ్చునన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారు.

★ ఓటు నమోదుకు గడువు: నవంబరు 6
★ ముసాయిదా జాబితా: నవంబరు 23
★ అభ్యంతరాల స్వీకరణ: డిసెంబరు 9 వరకు
★ తుది ఓటరు జాబితా: డిసెంబరు 30

దరఖాస్తుకు వీరు అర్హులు: ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి (ఆరో తరగతికి పైబడిన) పాఠశాలల్లో రెగ్యులర్ లేదా అడ్‌హక్ ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు నమోదుకు అర్హులని కలెక్టర్ తెలిపారు. పార్ట్‌టైమ్ పద్ధతిలో పనిచేసే వారు అర్హులు కాదన్నారు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు స్వీయ ధ్రువీకరణ పత్రం, సంబంధిత హెచ్‌ఓడీలు ఇచ్చే ధ్రువపత్రంతోపాటు జిల్లా విద్యాశాఖ అధికారి కౌంటర్ సైన్ చేసిన పత్రాలను సమర్పించాలన్నారు.

★ కళాశాల అధ్యాపకులైతే ఆర్జేడీల నుంచి, వర్సిటీ స్థాయిలో అయితే వీసీ నియమించిన అధికారుల నుంచి కౌంటరు సైన్ తీసుకోవాలన్నారు. గత ఆరేళ్లలో (01.11. 2024 నుంచి వెనక్కి లెక్క పెడితే) సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యా సంస్థలో అయినా మూడేళ్లకు తగ్గకుండా పనిచేసిన ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని కలెక్టర్ వివరించారు. గతంలో ఓటరుగా ఉన్నవారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీఆర్వో కె. మోహన్‌కుమార్, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక ఉపకలెక్టర్లు సీతారామమూర్తి, శేషశైలజ, లక్ష్మారెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగ డీటీలు పాల్గొన్నారు.



రాత్రి ఆహార వీధిలో దుకాణాలు

ఐదేళ్లలో రెండింతలకుపైగా పెంపు

అద్దె లేకపోయినా బరితెగింపు

గత పాలకుల అక్రమాల ఫలితం

రాత్రి ఆహార ధర.. ఆకాశాన్నంటేలా..!

కార్పొరేషన్, న్యూస్‌టుడే

రాత్రి వేళల్లో నగర ప్రజలకు ఆహారం అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఏర్పాటు చేసిన రాత్రి ఆహార వీధి (నైట్ ఫుడ్ స్ట్రీట్)లో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ వీధి గత ఐదేళ్లు అక్రమాలకు నిలయంగా మారిపోయింది. వైకాపా నాయకులు వసూళ్లకు తెరతీయడంతో ఇక్కడ అనర్థులు తిష్టవేశారు. ఇటీవల కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఈ అంశాన్ని లేవనెత్తారు. దీంతో గత పాలకవర్గ అక్రమాలు బయటపడతాయనే ఉద్దేశంతో మేయర్ 'రాత్రి ఆహార వీధి'ని రద్దు చేస్తూ తీర్మానం చేశారు.


ఐదేళ్లుగా తమ జేబులు నింపేసుకోవడానికి వైకాపా నాయకులు రాత్రి ఆహార వీధిని అడ్డా మార్చుకున్నారు. ఒక్కో దుకాణానికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. నెలనెలా వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేయడం ప్రారంభించారు. దీంతో వ్యాపారులు కూడా ఆహార ధరలు పెంచేశారు. జీవీఎంసీ అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. పెద్ద హోటల్‌లో బిర్యానీ ధర, ఇక్కడి బిర్యానీ ధరకు పెద్ద తేడా లేకపోవడం గమనార్హం. అన్నింటి ధరలు విపరీతంగా పెంచేయడంతో నగర వాసులు బెంబేలెత్తిపోతున్నారు.

తీర్మానం అడ్డుపెట్టుకుని వసూళ్లు

రాత్రి ఆహార వీధిలో దుకాణాలు తొలగించి, జీవీఎంసీ ఆధ్వర్యంలో వ్యాపారులను ఎంపిక చేయాలని గతేడాది కౌన్సిల్ సమావేశంలో మేయరు తీర్మానం చేశారు. కానీ, అది అమలు కాకుండా వైకాపా నాయకులు తెర వెనుక చక్రం తిప్పారు. తీర్మానాన్ని అడ్డు పెట్టుకుని వ్యాపారులను భయపెట్టి మరింత వసూలు చేశారు. నాయకుల అనుచరులు ఇక్కడి స్థలాలను ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేయించారు. వాటి నుంచి నెలకు రూ.వేలల్లో మామూళ్లు వసూలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా కొందరు వైకాపా నాయకులు ఇప్పటికీ వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. ఇప్పటికైనా కూటమి నాయకులు, జీవీఎంసీ అధికారులు అక్రమాలకు అడ్డుకట్ట వేసి లాటరీ ద్వారా వ్యాపారులను ఎంపిక చేయడంతోపాటు ఆహార ధరలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాత్రి ఆహార వీధిలో ధరలిలా...!

ఆహార పదార్థం	2019లో..	ప్రస్తుతం
● ఇడ్లీ ప్లేటు (4)	రూ. 20	రూ. 40
● దోశ	రూ. 30-40	రూ. 60-120
● చికెన్ బిరియాని	రూ. 80	రూ. 170-240
● స్మోక్డ్ ఫిష్	రూ. 100-150	రూ. 220-300
● లస్సీ	రూ. 20	రూ. 60-80
● చికెన్ నూడిల్స్	రూ. 60	రూ. 120-140



అనుమతులు లేకుండానే కొనసాగింపు

విశాఖ నగరంలో తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకునే వారి కోసం 2019లో అప్పటి కలెక్టర్ సెంట్రల్ పార్కు వద్ద రాత్రి ఆహార వీధిని ఏర్పాటు చేయించారు. అద్దె వసూలు చేయకూడదని నిర్ణయించారు. ప్రారంభంలో ఇక్కడ కేవలం 32 దుకాణాలు మాత్రమే ఉండేవి. తర్వాత వైకాపా ప్రభుత్వ రావడంతో పరిస్థితి మారిపోయింది. నాడు రెండు నెలల వ్యవధిలోనే వాటి సంఖ్య 120కు చేరుకుంది. కరోనా కారణంగా 2020లో ఈ వీధిని మూసేశారు. 2022లో అప్పటి వైకాపా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి విజయసాయిరెడ్డి ఆదేశాలతో తిరిగి తెరిచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జీవీఎంసీ కమిషనర్ అనుమతి లేకుండానే దుకాణాలు నడుస్తుండటం గమనార్హం. ప్రస్తుతం ఇక్కడ మొత్తం 169 దుకాణాలు కొనసాగుతున్నాయి.

జిల్లాకు రెండు ఇసుక రీచ్‌ల కేటాయింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా అవసరాలకు తగ్గట్టుగా ఇసుకను రప్పించేందుకు రాజమహేంద్రవరం, శ్రీకాకుళంలో రెండు ఇసుక రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయా రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చుకోవడానికి ఆన్‌లైన్‌లో బుకింగ్ స్లాట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాజమహేంద్రవరం రీచ్ నుంచి బుకింగ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. బల్క్ పద్ధతిలో ప్రైవేటు, ప్రభుత్వ అవసరాలకు సరఫరా చేస్తామని చెప్పారు. రవాణా ఛార్జీల విషయంలో ప్రస్తుతం ఉన్న ధర సరిపోదని ఆపరేటర్లు చెబుతున్నారని, ఆయా అంశాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయన్నారు. రవాణా ఛార్జీల పెంపునకు సంబంధించి త్వరలో ఒక నిర్ణయం వస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో కేటాయించిన రీచ్ నుంచి పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా ప్రారంభం కాలేదన్నారు. నదుల్లో నీటి ప్రవాహం అధికంగా ఉందన్నారు. ఈ కారణంగా కొంత ఆలస్యమవుతోందన్నారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా ఉంటుందని వివరించారు.

నిధులు మింగింది... కళ తప్పింది!!







సిరిపురం కూడలిలోని దత్ ఐలాండ్ వద్ద కూడలిని ఏడాది క్రితం ప్రజాధనం ఖర్చు పెట్టి వినూత్నంగా తీర్చిదిద్దారు. వైవిధ్యంగా ఉండేందుకు, సందర్శకులు కూర్చొనేందుకు టైర్లు, పాత మోటారు సైకిల్, ఖాళీ ఇనుప డ్రమ్ములతో ఏర్పాట్లు చేశారు. ఫొటోలు దిగేందుకు, రాత్రి వేళల్లో గడిపేందుకు యువత ఎక్కువగా ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ఈ ప్రాంతం కళతప్పి వెలవెలబోతోంది. వస్తువులన్నీ దెబ్బతిన్నాయి. పరికరాల రేకులన్నీ ఊడిపోతున్నాయి. కూర్చునేందుకు ఉంచిన వస్తువులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. -ఈనాడు, విశాఖపట్నం.

రంగులు కలిపి.. ఆహారం కల్తీ

అధికారులు తనిఖీల్లో వెలుగులోకి

ఈనాడు, విశాఖపట్నం: నగరంలో కొన్ని రెస్టారెంట్లు, హోటళ్లలో వాడిన నూనెలను మళ్లీమళ్లీ వినియోగిస్తున్నారు. చెడిపోయిన మాంసాన్ని నూనెల్లో వేడి చేసి ఇచ్చేస్తున్నారు. నాణ్యత లేని పదార్థాలను వంటల్లో వాడేస్తున్నారు. పాడైన బిర్యానీని వేడి చేసి అమ్మేస్తున్నట్లు ఆహార భద్రతాధికారుల తనిఖీల్లో గుర్తించారు. వీటితో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందనడంతో సందేహం లేదు. ఆహారాన్ని భద్రపరచడంలో కొందరు సరైన పద్ధతులు పాటించకపోవడం అధికారులు గుర్తించారు. సరిపడా శీతలీకరణ లేక కొన్ని పదార్థాలు పాడైపోతున్నాయి. అయినా వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార తనిఖీ అధికారి నందాజి

ఆరు నెలల్లో ఇలా..

★ మొత్తం తనిఖీలు	: 600
★ నమూనాల సేకరణ	: 217
★ కేసులు నమోదు	: 28

సేకరించిన నమూనాల వివరాలు

తనిఖీ ప్రాంతం	నమూనాలు	కేసులు
రెస్టారెంట్లు	59	4
పాల ఉత్పత్తులు	20	8
మిఠాయి దుకాణాలు	15	3
బేకరీలు	13	3
వసతిగృహాలు	8	1
కిరాణాదుకాణాలు	78	9

నూనెల్లో కల్తీ: నూనెల కల్తీని టీపీసీ (టోటల్ పోలార్ కాంపౌండ్స్) మీటరు ద్వారా గుర్తించొచ్చు. నేరుగా కంపెనీ నుంచి వచ్చే నూనెల్లో టీపీసీ 5 నుంచి 7 శాతం ఉంటుంది. వాడిన నూనెలను మళ్లీ వేడి చేస్తే టీపీసీ పెరుగుతుంది. ఇది 25 శాతానికి మించితే ఆరోగ్యానికి ప్రమాదకరం. గతంలో కొన్ని హోటళ్లలో తనిఖీ చేయగా 36 శాతం ఉన్నట్లు తేలింది. ఓ ప్రముఖ రెస్టారెంట్‌లోనూ ఈ పరిస్థితి గుర్తించారు. వీటిని తింటే క్యాన్సర్, జీర్ణకోశ సంబంధ సమస్యలు తలెత్తుతాయి.

★ మిఠాయిల్లో అదనపు రంగులు వినియోగించడం, హానికర పదార్థాలుండాన్ని గుర్తించారు.

★ కొన్ని వసతి గృహాల్లో వినియోగిస్తున్న పప్పులు నాసిరకమైనవిగా తేలింది. కిరాణా దుకాణాల్లో కొన్ని సరకులు నాణ్యతలేనివిగా కనుగొన్నారు.



రోజూ తినే వారి సంఖ్య 1.5 లక్షలు (సుమారు)

విశాఖలో స్టార్ హోటళ్లు : 27 రెస్టారెంట్లు : 1,000 (సుమారు) హోటళ్లు, ఫుడ్ స్టాళ్లు : 2,500

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.39 కోట్లు


కానుకలు లెక్కిస్తున్న సేవా కార్యకర్తలు, సిబ్బంది

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1,39,44,045 సమకూరినట్లు ఈవో తెలిపారు. దీంతో పాటు 53.200 గ్రాముల బంగారం, 8.650 కిలోల వెండి లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 28 రోజులకు సంబంధించినదిగా ఈవో తెలియజేశారు.

బెటాలియన్‌లో వార్షిక తనిఖీలు


దస్త్రాలు పరిశీలిస్తున్న కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ

కొమ్మాది, న్యూస్‌టుడే: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ ప్రతి విభాగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా సిబ్బంది కవాతుతో స్వాగతం పలకగా అడిషనల్ కమాండెంట్ సీహెచ్.వి.ఎస్.పద్మనాభరాజు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వివిధ విభాగాలను, దస్త్రాలను, ఆయుధాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేయాలని, అప్పుడే తగిన గుర్తింపు వస్తుందని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిరస్త్రాణం ఉన్నా.. తలకెక్కలేదు!!



శిరస్త్రాణం ధరించని వాహన చోదకులను అడ్డుకున్న పోలీసులు



వాహన చోదకులు శిరస్త్రాణం ధరించడం ఎంతో ముఖ్యమని పోలీసులు పదేపదే చెబుతున్నారు. తనిఖీలు చేసి హెచ్చరిస్తున్నారు. అయినా చాలా మంది పట్టించుకోవడం లేదు. సోమవారం మద్దిలపాలెం వద్ద హెల్మెట్‌లు ధరించని వారిని అడ్డుకొని కేసులు నమోదు చేశారు. అయితే.. శిరస్త్రాణాన్ని చేత్తో పట్టుకొని, వాహనానికి తగిలించి నిర్లక్ష్యం వహించిన పలువురు అప్పటికప్పుడు తలకు పెట్టుకోవడం గమనార్హం. వ్యక్తిగతంగా ఎవరి భద్రతకు వారే బాధ్యులన్న విషయాన్ని చాలా మంది విస్మరిస్తున్నారు.
– ఈనాడు, విశాఖపట్నం

గోరాపూర్-దార్లిపుట్ డబ్లింగ్ లైన్‌కు అనుమతులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డివిజన్‌లోని గోరాపూర్-దార్లిపుట్ సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనుల్లో 12.649 కిలో మీటర్లకు సీఆర్ఎస్ అనుమతి లభించిందని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించి ఈ అనుమతులు ఇచ్చారన్నారు. కొత్తవలస-కిరండూల్ లైన్‌లోని ఈ ప్రాంతంలో డబ్లింగ్ పనులు పూర్తి చేయడానికి వాల్తేర్ రైల్వే వ్యూహాత్మకంగా వ్యవహరించిందన్నారు. పూర్తయిన డబ్లింగ్ పనుల్లో 2 కిలో మీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మిగిలిన భాగమంతా ఒడిశా పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఈ లైన్ అందుబాటులోకి రావడంతో రైళ్ల వేగంతో పాటు ట్రాఫిక్‌ను పెంచుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.


డబ్లింగ్ లైన్‌ను పరిశీలిస్తున్న సీఆర్ఎస్ బ్రిజేష్ కుమార్ మిశ్రా, తదితరులు

ఉత్సాహంగా గుండె దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ మయూక్ చౌదరి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: చినగదిలి హెల్త్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో సోమవారం ప్రపంచ గుండె దినోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ మయూక్ చౌదరి మాట్లాడుతూ.. గుండె వైద్యానికి కేర్ ఆసుపత్రుల్లో నూతన చికిత్సా విధానాలు, అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. రోగులు ఆసుపత్రి ఆవరణలోకి వచ్చిన దగ్గర నుంచి వారు కోలుకుని తిరిగి వెళ్లే వరకు ఆసుపత్రిలో మంచి వాతావరణం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రోగులు, వారి బంధువులు తమకు గల అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కేక్ కోసి అందరికి పంచారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు వెంకటేశ్వరరావు, వీవీవీఎస్ఎమ్ కుమార్, రాకేష్ దుబ్బా, వైద్య బృందం పాల్గొన్నారు.

సమ్మె తాత్కాలిక వాయిదా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: ఫెర్రోస్క్రాప్ నిగమ్ లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)లో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు విశాఖ ఉక్కు ఎఫ్ఎస్ఎన్ఎల్ యూనిట్ ఫెర్రోస్క్రాప్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మంత్రి రాజశేఖర్, పెద్దాడ రాములు, ఎం.అమ్మిరెడ్డి తెలిపారు. యూనిట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సంస్థలో ఉత్పత్తి నిలిచిపోతుండటంతో తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులు కోరారని, కార్మిక సమస్య పరిష్కారానికి డిల్లీలోని లేబర్ కమిషనర్ హామీ ఇవ్వడంతో అన్ని యూనిట్లలోని నాయకులు సమ్మె వాయిదాకు అంగీకరించినట్టు తెలిపారు. సోమవారం నుంచి దేశంలోని అన్ని యూనిట్లలో ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు విధులకు హాజరు కావాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో ఒ.వి.రావు, జి.ప్రసాద్, గోవింద్, ఈశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


విశాఖ ఉక్కు కర్మాగారం యూనిట్ వద్ద ఎఫ్ఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

ఫుట్‌బాల్ విజేత విశాఖ

పల్నాడు జిల్లా వినుకొండ లయోలా పాఠశాలలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్- 17 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో బెస్ట్ స్ట్రైకర్‌గా భరత్ సాయి (వైజాగ్) ఎంపికయ్యారు. విజేతలకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, వినుకొండ రూరల్


బాలుర విజేత వైజాగ్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ, తదితరులు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు; ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంస్థల్లో పొరుగు, ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రయివేటీకరణ వేగంగా జరుగుతోందని, ఫలితంగా శాశ్వత ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవడమే కాకుండా నిరుద్యోగం మరింత పెరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అతి తక్కువ వేతనాలిచ్చి పనులు చేయించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్, పోర్టు, రైల్వే, కోరమాండల్, ఆర్టీసీ, డెయిరీ తదితర సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు, సీఐటీయూ నాయకులు వెంకటరెడ్డి, బి.జగన్, యు.రాజు, టి.నూకరాజు, పి.మణి పాల్గొన్నారు.

క్రీమీలేయర్, వర్గీకరణపై అత్యుత్సాహం ప్రదర్శిస్తే ప్రతిఘటన

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్‌పై సుప్రీంకోర్టు తీర్పును పునసమీక్షించాలని కోరుతూ పిటిషన్లు వేశామని, ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు అత్యుత్సాహం ప్రదర్శిస్తే ప్రతిఘటన తప్పదని భారతీయ బౌద్ధ మహాసభ, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శన్ అన్నారు. ఉక్కునగరం ఎస్సీ, ఎస్టీ సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ, క్రీమీలేయర్ రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షులు బయ్యే మల్లయ్య అన్నారు. కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు, ఉక్కు మాజీ అధికారుల సంఘం అధ్యక్షులు మాతంగి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా డీబీఎస్ అధ్యక్షులు ఎం.ఎ.అప్పలరాజు తదితరులు పాల్గొని వర్గీకరణ వద్దని, ఉమ్మడి రిజర్వేషన్ కొనసాగించాలని, రిజర్వేషన్ శాతం పెంచాలని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బయ్యే మల్లయ్య

ఈస్ట్రన్ సీ బోర్డు కమాండర్‌గా ఏడీజీ చేరిక


కోస్టుగార్డు సిబ్బందితో కరచాలనం చేస్తున్న డాన్ని మిఖాయిల్

సింధియా, న్యూస్‌టుడే: భారతీయ తీరగస్తీ దళం ఈస్ట్రన్ సీబోర్డు-విశాఖపట్నం కేంద్రానికి కమాండర్‌గా అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాన్ని మిఖాయిల్ బాధ్యతలు స్వీకరించినట్లు సోమవారం ఐసీజీ వర్గాలు తెలిపాయి. కోస్టు గార్డు రీజియన్(ఈస్ట్)కు ఫ్లాగ్ ఆఫీసర్‌గా పలు సామర్థ్య విధులను చేపట్టిన అనుభవం ఆయనకు ఉందన్నారు. తీరగస్తీ దళంలో వివిధ రకాల ఆపరేషన్లతో మౌలిక వసతుల కల్పనకు అడుగులు వేయనున్నట్టు వెల్లడించాయి. తొలుత ఐసీజీ విశాఖ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఐసీజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన


బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బాధితుల నుంచి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. గడువులోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏ.సి.పి.లు, సి.ఐ.లు వారి వారి కార్యాలయాల్లో ఉంటూ పలువురి నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం జరిగిన వేదికకు 96 మంది బాధితులు హాజరయ్యారు.

ఎక్సైజ్ ఎస్.ఐ.లకు బదిలీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో ఎస్.ఐ.లకు బదిలీలు జరిగాయి. నగరంలోని వివిధ స్టేషన్లకు వారిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. * జి.జ్ఞానేశ్వరి(విజయనగరం-2 స్టేషన్), వి.వేణుగోపాల్(డీటీఎఫ్, విశాఖ)ను మహారాణిపేట స్టేషన్‌కు, వై. విమలాదేవి(ఐఎంఎల్ డిపో, అనకాపల్లి), బి.చలంనాయుడు(పాలకొండ)ను సీతమ్మధార స్టేషన్‌కు, ఎం.మోహనరావు(మహారాణిపేట), వి.ఎల్.కరుణాలత(ఆముదాలవలస)ను గోపాలపట్నం స్టేషన్‌కు, ఈ.రామకృష్ణ(పొందూరు, శ్రీకాకుళం)ను, కె.నరసింహామూర్తి(విజయనగరం-1)ను గాజువాక స్టేషన్‌కు, జి.శ్రీనివాసరావు(అనకాపల్లి), ఎల్.మాధవి(శ్రీకాకుళం)ను పెందుర్తి స్టేషన్‌కు, బి.వెంకటరాజు(ఐఎంఎల్ డిపో-1, విశాఖ)ను కె.అనీల్‌కుమార్(ఇచ్ఛాపురం)ను భీమునిపట్నం స్టేషన్‌కు, ఆర్.శ్యామల (ఐఎంఎల్ డిపో-1), కె.ఎ.విజయ్‌కుమార్(ఐఎంఎల్ డిపో-2), ఎస్.ముసలీనాయుడు (సీతమ్మధార స్టేషన్)ను ఈఎస్ టాస్క్‌ఫోర్స్, విశాఖకు, ఎల్.అరుణకుమారి(విజిలెన్స్, శ్రీకాకుళం)ను, పి.అప్పారావు(చోడవరం స్టేషన్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్, విశాఖకు, ఎ.రాజ్యలక్ష్మి(ఐఎంఎల్ డిపో, శ్రీకాకుళం)ను ఎస్‌టీఎఫ్, విజయవాడ, జి.రాజేశ్వరి(కోటపాడు పీఎంకె డిస్టలరీస్)ను డిస్టలరీ వింగ్‌కు బదిలీ చేశారు.

జీవీఎంసీ సంరక్షణలోని ఆవు మృతి

రూ.40వేల నష్టపరిహారం అందజేత


బాధితుడు పిన్నింటి మోహన్‌కు చెక్కు అందిస్తున్న పశువైద్యాధికారి కిషోర్‌కుమార్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ సంరక్షణలో ఉన్న ఆవు సోమవారం ఉదయం మృతి చెందింది. సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతోనే గోమాత మృతి చెందిందని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సంరక్షణ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. పశువైద్యాధికారులు కిషోర్‌కుమార్, కిరణ్, సహాయ వైద్యాధికారి ప్రసాద్ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆవు మృతి చెందడానికి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణమని మూర్తియాదవ్ ఆరోపించారు. తక్షణం ప్రధాన వైద్యాధికారి, పశువైద్యాధికారిపై సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని అదనపు కమిషనర్ సోమన్నారాయణ, కమిషనర్ సంపత్‌కుమార్‌కు తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం పశువైద్యాధికారితో చర్చలు జరిపి ఆవు యజమానికి నష్టపరిహారం ఇవ్వడంతోపాటు, ఐదుగురు సిబ్బందిని తాత్కాలికంగా నిలిపివేయాలని, మరొకరికి సంజాయిషి నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఆవు యజమాని పిన్నింటి మోహన్‌కు రూ.40వేల నష్ట పరిహారాన్ని పశు వైద్యాధికారి కిషోర్‌కుమార్ అందజేశారు.

ఎట్టకేలకు ఇంటికి చేరిన కానిస్టేబుల్

పని ఒత్తిడి వల్లే ఎవరికీ చెప్పకుండా వెళ్లానని వెల్లడి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా కనిపించకుండా పోయిన ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కె.వెంకట నర్సింహమూర్తి ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. గత నెల 22వ తేదీన స్టేషన్‌లో విధులకు హాజరై తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. ఆ మేరకు పీఎంపాలెం స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేయగా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. రోజులు గడిచినా ఆచూకీ లభించక పోవడంతో ఆదివారం కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఆ కానిస్టేబుల్ సోమవారం రవీంద్రనగర్‌లోని ఇంటికి చేరుకోవడంతో పోలీసులు అతడిని విచారించారు. 'చాలా కాలంగా మహిళా స్టేషన్‌కు సంబంధించిన కోర్టు కేసులు నేనొక్కడినే చూడడం వల్ల పని భారం పెరుగుతోంది. దీంతో మానసిక ఒత్తిడికి గురై కోర్టు ఆవరణలో ఒకసారి కళ్లు తిరిగి పడిపోయాను. మానసిక ప్రశాంతత కోసం ఎవరికీ చెప్పకుండా తిరుపతి, విజయవాడ వెళ్లి వెంకన్న స్వామిని, దుర్గమ్మను దర్శించుకుని వచ్చాను తప్ప మరే ఇతర కారణాలు లేవు.' అని అతడు వివరించినట్లు సీఐ పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఉక్కు సీఎండీ సక్సేనా


ఉక్కు అధికారులతో సమీక్షిస్తున్న నూతన సీఎండీ ఎ.కె.సక్సేనా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)గా మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్(మోయిల్) సీఎండీ ఎ.కె.సక్సేనా సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉక్కు డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్)-2 (కృష్ణా)ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. తరువాత ఈడీ(వర్క్స్) సమావేశ మందిరంలో ఉక్కు ప్రధాన యూనిట్ల అధిపతులతో ఉత్పత్తి పెంపుపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎ.కె.బాగ్చి, ఎస్.సి.పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్, సీజీఎం(వర్క్స్), ఇతర సీనియర్ అధికారులు సక్సేనాతో కలిసి కర్మాగార సందర్శనలో పాల్గొన్నారు.

నేడు సింహగిరిపై కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో మహాలయ పక్షం పూర్తి కావడంతో పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనం నిలిపివేయనున్నట్లు తెలియజేశారు.

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి కొంతమంది వీధి విక్రయదారులు హోంగార్డులపై దాడిచేసి గాయపరిచారు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లాకు చెందిన షేక్ రహీమ్, నగరానికి చెందిన హోంగార్డులు అనిల్, నూకరాజు ఆదివారం రాత్రి బీచ్‌రోడ్డులో సరదాగా గడిపేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ ఐస్‌క్రీమ్ విక్రయదారుడితో డబ్బుల విషయంలో గొడవ జరిగింది.

డబ్బుల విషయంలో ఘర్షణ

హోంగార్డులపై వీధి విక్రయదారుల దాడి

తాము పోలీసులమని.. డబ్బులు అడుగుతావా అంటూ ఈ ముగ్గురు ఐస్‌క్రీం విక్రయదారుడిని నిలదీశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. సమీపంలోని వీధి వ్యాపారులు అందరూ అక్కడకు చేరారు. వీరి మధ్య వాగ్వాదం పెరగడంతో ఈ ముగ్గురిపై విక్రయదారులు దాడిచేశారు.

భారీ కొండచిలువ కలకలం



మల్కాపురం, న్యూస్‌టుడే: 62వ వార్డు త్రినాథపురం కొండవాలు ప్రాంతంలో ఓ భారీ కొండచిలువ సోమవారం కలకలం రేపింది. ఈ క్రమంలో ఓ ఇంటి యజమాని పెంచుతున్న కోళ్లలో మూడింటిని అది మింగేసింది. ఆపై కదల్లేని స్థితిలో ఉండగా దాన్ని గమనించి పాములుపట్టే నేర్పరి నాగరాజుకు సమాచారమిచ్చారు. ఆయన వచ్చేసరికి, అది తప్పించుకొనేందుకు ప్రయత్నించి బయటకు పోలేక మింగేసిన కోళ్లలో రెండింటిని అక్కడే కక్కేసింది. అదే సమయంలో దాన్ని చాకచక్యంగా పట్టుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	102	95
లైవ్	124	115
డ్రెస్‌డ్	180	200
స్కిన్‌లెస్	205	210

పెందుర్తి

విశ్వేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో నెయ్యి కల్తీ వ్యవహారం నేపథ్యంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రాయశ్చిత్త దీక్ష చేసి మద్దతు తెలిపారు. సోమవారం సాయంత్రం చినముషిడివాడ దరి విశాలాక్షి విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చకులు ఎమ్మెల్యేతో పూజలు చేయించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించి పరమేశ్వరుడిని సేవించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడలో సాధన సంస్థ ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, సాధన సంస్థ అధ్యక్షులు పైలా గోపి దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో 30 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ 1620 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని.. వారంతా సొంతంగా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాధన కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, శిక్షకురాలు లక్ష్మి, నాగలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధన సంస్థ కార్యదర్శి ఇస్మాయిల్

మర్యాద పూర్వక కలయిక

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి సబ్ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ.కీర్తిప్రియ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక రత్నగిరినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు పి.సన్యాసిరావు, రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధి చిన్నారావు పాల్గొన్నారు. పెందుర్తి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.ఆనంద్‌కుమార్‌ను 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిసిన పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కీర్తిప్రియ, సిబ్బంది

శారదాపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విశాఖ శారదాపీఠంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని పీఠం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది నుంచి రాజశ్యామల సువాసినీ శక్తి దీక్షను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలిసారిగా మహిళలు పూజల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల సహిత చండీయాగం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవంలో ప్రతి నిత్యం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. నిత్యార్చన, హోమాలు, శారదామాతకు విశేష అభిషేకాలు, శ్రీచక్ర నవావరణార్చన, తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి పిలుపునిచ్చారు. పూజల్లో పాల్గొనాలనుకునే భక్తులు 94403 93333 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర తెలుగునాడు విభాగ ఉత్తరాంధ్ర కార్యదర్శిగా సత్యానంద్

వేపగుంట, న్యూస్‌టుడే: రాష్ట్ర తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర జోనల్ కార్యదర్శిగా వేపగుంటకు చెందిన పి.వి.సత్యానంద్ ఎంపికయ్యారు. రెండు రోజుల క్రితం జిల్లా తెదేపా కార్యాలయంలో ఉద్యోగులు, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆయనను ఎంపిక చేశారు. ప్రస్తుతం మలేరియా సబ్‌యూనిట్ కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజరుగా పని చేస్తున్నారు. గతంలో పలు ఉద్యోగుల సంఘాల్లో పని చేశారు. ఈ అవకాశం కల్పించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



సమగ్ర పోషణ.. సమీకృత అభివృద్ధి దిశగా..

పెందుర్తి, న్యూస్‌టుడే

ఆరేళ్ల లోపు బాలల నుంచి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వరకు వారి సమగ్ర పోషణ, పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ.. సక్షం పేరిట అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలనే మెరుగుపరిచి సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టెయినబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) కేంద్రాలుగా రూపొందించింది. పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 19 కేంద్రాలు సక్షం కింద ఎంపికయ్యాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

సదుపాయాలు ఇలా..

సక్షం పథకంలో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సదుపాయాలు కల్పించాయి. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదల, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ వసతులున్నాయి.

- చిన్నారులకు బాల్యారంభ దశ సంరక్షణ, విద్యా బోధనలో భాగంగా కుర్చీలు, టేబుళ్లు, ఇతర వసతులు కల్పించారు.
- పోషణ వాటిక పేరిట అంగన్‌వాడీల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుతారు. ఇక్కడ పండిన వాటిని తల్లీబిడ్డలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారంగా అందజేస్తారు.
- బాలలను ఆకట్టుకునే విధంగా బోధన చేయడం కోసం దృశ్యశ్రవణ విద్యను అందించేందుకు ఎల్ఈడీ స్మార్ట్ టీవీని ఏర్పాటు చేశారు. అంతర్జాలంతో పాటు స్టోరేజీ డివైజ్‌ల ద్వారా పాటలు, ఆటలు, పాఠాలను ప్రదర్శిస్తారు.
- నాణ్యమైన రక్షిత నీటిని అందించి రోగాల నుంచి కాపాడేందుకు మంచినీటి శుద్ధీకరణ యంత్రాలను అమర్చారు.
- పిల్లల శారీరక, మానసిక, భావనాత్మక అభివృద్ధికి దోహదం చేసేలా కేంద్రాలను ఆకర్షణీయంగా అలంకరించి వివిధ రకాల బొమ్మలు, చిత్రాలు, ఆట వస్తువులు సమకూర్చారు.
- ఆవరణలో వాన నీటి సంరక్షణ చర్యలకు పిట్ ఏర్పాటు చేశారు.



పులగవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ్ వాటిక



ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంటు

పెందుర్తి ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలు ఇవే..

పెందుర్తి రైల్వేగేటు దరి చిన్నమిల్లు ఏరియా, పాత పెందుర్తి-1, పులగవానిపాలెం, రాంపురం, శ్రీరాంపురం, వెలంపేట, గంగమ్మపేట, కరకవానిపాలెం, కోట్నివానిపాలెం, ముదపాక, ఎస్ఆర్‌పురం, ఎస్ఆర్‌పురం కాలనీ, జుత్తాడ, పెదగాడి, ఇప్పిలివానిపాలెం, నందవరపువానిపాలెం, నరవ-2, ప్రహ్లాదపురం, పిట్టవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలు సక్షం కేంద్రాలుగా ఎంపికైనట్లు సీడీపీవో నీలవేణి పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: సబ్బవరం మేజరు పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి బాలాజీ ఆసుపత్రి వరకు కాలువ లేక ఎగువ నుంచి వచ్చే మురుగునీరంతా రోడ్డుమీద నుంచే పారుతోంది. - ఆర్.సత్యనారాయణ, సబ్బవరం

సమాధానం: పంచాయతీ సమావేశంలో సంబంధిత సమస్యను చర్చించి పరిష్కరిస్తాం. - కె.మూర్తిబాబు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి: 90598 98721 వేపగుంట: 93472 79909

సబ్బవరం, న్యూస్‌టుడే

సమస్య: 97వ వార్డు పురుషోత్తపురం శివాలయం వెనుక ప్రాంతంలో 365/Ed/3 స్తంభానికి ఉన్న వీధి దీపం చాలా కాలం నుంచి వెలగడం లేదు. - సూర్యభవాని, పురుషోత్తపురం

పరిష్కారం: త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - దుర్గాప్రసాద్, ఏఈ, 95వ వార్డు

పీలా గోవింద్‌కు అభినందనలు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణ రావు, రాంపురం గ్రామ నాయకులు పెందుర్తిలోని పీలా నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పీలా గోవింద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, తదితరులు



వినతులను స్వీకరిస్తున్న జడ్సీ హేమవతి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. జోనల్‌కమిషనర్ హేమవతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. టీచర్స్‌లేఅవుట్‌లో యూజీడీ కనెక్షన్, రోడ్లు, కాలువలు నిర్మించాలని.. పాయ్యరాజుపాలెంలో అక్రమ నిర్మాణం తొలగించాలని.. 93వ వార్డు గౌతంనగర్‌లో రోడ్డు ఆక్రమించి గోడకట్టడంపై చర్యలు తీసుకోవాలని, 95వ వార్డు శేషాద్రినగర్‌లో పిచ్చి మొక్కలు తొలగించాలని, 93వ వార్డు శ్రీనివాసనగర్‌లో కాలువపై పెట్టిన షెడ్‌ను తొలగించాలని వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించిన జడ్సీ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చురుగ్గా ఆలయ నిర్మాణం

పరవాడ, న్యూస్‌టుడే: మేజరుపంచాయతీ పరవాడ సంతబయలు వద్ద ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇక్కడ గతంలో ఉన్న పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాని స్థానే కొద్దినెలల క్రితం నూతన ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సంబంధిత పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. అన్ని హంగులతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు తెలిపారు.



నిర్మాణంలో ఆంజనేయస్వామి ఆలయం

ఉత్సాహంగా క్రీడా పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండం పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ ఎం.వి.నాగేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఎస్.రామ్మోహన్, రమ్య, రాజు, నాయుడు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన రైఫిల్ షూటింగ్ క్రీడాకారులతో నిర్వాహకులు



వుషు పోటీలకు హాజరైన విద్యార్థులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు

పరవాడ, న్యూస్‌టుడే: తల్లీబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పరవాడ ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి అన్నారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ 2, 3 కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం ద్వారా రక్తహీనత దూరమవుతుందన్నారు. అనంతరం కేంద్రాల్లోని ఎల్ఈడీ టీవీ, వాటర్ ఫిల్టర్, పోషణవాటిక ప్రారంభించారు. అనంతరం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. గర్భిణులకు సాముహిక సీమంతాలు చేశారు. సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చుక్క రామునాయుడు, అంగన్‌వాడీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పరవాడలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, నాయకులు

తల్లీబిడ్డల సంరక్షణకు కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: తల్లీబిడ్డల సమీకృత అభివృద్ధి, పోషణ్ సక్షం అంగన్‌వాడీల ద్వారా మరింత మెరుగవుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. జీవీఎంసీ 97వ వార్డు పరిధిలోని పులగవానిపాలెంలో సక్షం పథకంలో భాగంగా ఉన్నతీకరించి అంగన్‌వాడీ కేంద్రాన్ని కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సక్షం పథకంలో భాగంగా పెందుర్తి ప్రాజెక్టు పరిధిలో ఎంపికైన 19 అంగన్‌వాడీ కేంద్రాల్లో వివిధ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లీబిడ్డల సంరక్షణకు ఎంతగానో కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాన్ని.. అనంతరం పోషణ్ వాటిక, ఆర్‌వో నీటి సదుపాయం, వాననీటి సంరక్షణ పిట్‌లను రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. పెందుర్తి ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శానాపతి శంకర్రావు, అయితు సింహాచలం, అవగడ్డ అప్పలనాయుడు, శానాపతి సోమశేఖర్, పెందుర్తి ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఎంఈవో మధుమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీవీ గీతాలక్ష్మి, డి.మానస, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



పులగవానిపాలెంలో సక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, తదితరులు

సంకల్ప కాపు సంక్షేమ సంఘం ఏర్పాటు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో నూతనంగా 'సంకల్ప కాపు సంక్షేమ సంఘం' ఏర్పడింది. దీనికి అధ్యక్షులుగా గవర అప్పారావు, ఉపాధ్యక్షులుగా బలిరెడ్డి సత్యనారాయణ, కార్యదర్శిగా కుంచా గౌరీ మహాలక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శిగా కంచిపాటి రాంబాబు, కోశాధికారిగా రేసుపూడి రమణ, సభ్యులుగా ఆకుల గణేష్, జెట్టి నాగ వరప్రసాద్, గల్లా సూరిబాబు, పడాల వెంకటరమణ, జెట్టి లీలా వరప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారంతా పెందుర్తి సుజాతనగర్ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి సోమవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఉద్ధృతం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ యత్నాలు నిలిపివేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, గనులు కేటాయించాలన్న డిమాండ్లతో మూడు రోజులపాటు ధర్నాలు, నిరసనలతో కేంద్రంపై ఒత్తిడి పెంచనున్నట్లు పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు 1327వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 1న విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టనున్నారు. 2న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్ద ధర్నా, 3న రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ దీక్షల్లో ఎల్ఎంఎంఎం, డబ్ల్యూఆర్ఎం, ఎస్‌బీఎం, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, సీతారామరాజు, ఆర్.ధనరాజు, రాజేశ్వరరావు, కర్రి బాబూరావు, దాసరి శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ

దుర్గాదేవి ఉత్సవాలకు ముస్తాబు

పరవాడ, న్యూస్‌టుడే: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అక్టోబరు 3 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పరవాడ మండలంలో వివిధ చోట్ల మండపాలు ముస్తాబవుతున్నాయి. అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి యువజన సంఘాలు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని పరవాడ, తానాం, వెన్నెలపాలెం, దేశపాత్రునిపాలెం, ధర్మారాయుడుపేట, లంకెలపాలెం, మంత్రిపాలెం, పెదముషిడివాడ, కలపాక, గొర్లెవానిపాలెం సర్దార్ గౌతులచ్చన్న నగర్ కూడలి, పి.భోనంగి తదితర ప్రాంతాల్లో మండపాలు రూపుదిద్దుకున్నాయి. అక్టోబరు 12 వరకు రోజూ ప్రత్యేక కుంకుమ పూజలతో పాటు అభిషేకాలు, అన్నసమారాధనలు, లక్షదీపార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కళాకారులకు నిలయమైన గొర్లెవానిపాలెంలో 2 నుంచి 8 అడుగుల ఎత్తు ఉన్న వందలాది విగ్రహాలను కళాకారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.




గొర్లెవానిపాలెంలో రూపుదిద్దుకున్న అమ్మవారి విగ్రహాలు

ఉక్కు కార్మికుల ఆకాంక్షను కాపాడతాం

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కార్మికుల ఆకాంక్షలు కాపాడేందుకు కృషి చేస్తున్నామని, ఒప్పంద కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తున్నట్లు విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో పోరాట కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉక్కులో నెలకొన్న అనిశ్చితి, ఆర్థిక విధ్వంసం, ఉద్యోగుల కార్మికుల ఆందోళన, నష్టాల వైపు నెట్టే పరిస్థితిని నాయకులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఏడో తేదీ లోపు నూతన ఇంఛార్జి సీఎండీని కలిసి అన్ని అంశాలపై చర్చలు జరుపుతానన్నారు. కార్మికులు చేస్తున్న ఆందోళనను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల తొలగింపు, ఆర్థిక ఆంక్షలు ఈ సమయంలో అమలు చేయడం సరైన విధానం కాదన్నారు. ఈ మధ్య జరిగిన ఒప్పంద కార్మికుల తొలగింపుకు చేసిన కుట్ర కోణం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి దృష్టిలో లేదని ఈ విషయమై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, విళ్ళారామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.అప్పారావు, మసేనురావు, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

అంచు దాటితే గండమే



సబ్బవరం మండలం అసకపల్లి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో కోతకు గురైన రోడ్డు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అసకపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు అసకపల్లి-దిబ్బపాలెం రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రహదారి అంచు దాటితే గండం తప్పదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ వాహనాలు అదుపు తప్పి పలువురు గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన చోట మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధి పులగవానిపాలెం రోడ్డులోని మొండిబంద వద్ద ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో రెండు గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో అటువైపు వెళ్తే ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు కుంగిపోవడంతో భారీ గుంత ఏర్పడింది. ఆ పక్కనే మరో గొయ్యి ఉండడంతో కార్లు, ఇతర పెద్ద వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గోతులు పూడ్చి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పులగవానిపాలెం రోడ్డులోని మొండి బంద వద్ద ప్రమాదకరంగా గోతులు

గ్రామ సింహాల స్వైరవిహారం



పరవాడలో రహదారిపై శునకాలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరుపంచాయతీ పరవాడలో వీధికుక్కల బెడద ఎక్కువైంది. గ్రామంలోని వందలాది శునకాలు సంచరిస్తుండటంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. రోజురోజుకీ సమస్య పెరుగుతున్నా వాటి నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని.. ఏదో ఒకరోజు తూతూ మంత్రంగా కుక్కలను పట్టించి చేతులు దులిపేసుకుంటున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. పొలాల్లో గుంపులుగా సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏటీఎం సెంటర్లు, దుకాణాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో తిష్ఠ వేస్తున్నాయని చెబుతున్నారు. రాత్రి వేళ పెద్దగా అరవడంతో కంటినిండా నిద్ర కరవైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


క్రీడలతో మానసిక ఉల్లాసం

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందుతారని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగాయి. క్రీడలను ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలుర, బాలికలకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖ జిల్లా ఉప విద్యాశాఖాధికారి రవీంద్రబాబు, పీడీ కార్యవర్గం కన్వీనర్ లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, తదితరులు







ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ మణిమేఖలై, ఆ బ్యాంకు అధికారులు ★ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు ★ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి. చిత్రంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ తదితరులు

వరద బాధితులకు అండ

- సీఎం సహాయనిధికి పలువురు విరాళాలు

ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే యంత్రాంగం: ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పలువురు వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు వరద బాధితుల్ని ఆదుకోవడానికి ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను పలువురు కలిసి విరాళాల చెక్కుల్ని అందజేశారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు వేతనం

వరద బాధితుల సహాయార్థం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ.5,90,01,087ను విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును సీఈవో, ఎండీ ఎ.మణిమేఖలై సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు ఎస్.రామసుబ్రహ్మణియన్, సీవీఎన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

✦ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు రూ. కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును చంద్రబాబుకు అందజేశారు.

✦ ఆర్జా స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్‌కృష్ణమూర్తి రూ.కోటి అందజేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి ఇచ్చారు.

✦ కేరళకు చెందిన పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ రూ.50 లక్షల చెక్కును మంత్రి లోకేశ్‌కు ఇచ్చారు.

✦ విజయవాడకు చెందిన ఇండిపెండెంట్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఐసీఎంఏ) ప్రతినిధులు రూ.50 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందజేశారు.

✦ బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు రూ.25 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు.

✦ శశి విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.25 లక్షల విరాళమిచ్చారు. ఈ మేరకు మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేశారు. ఆ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల తరఫున గతంలో రూ. కోటి విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో మరో రూ.25 లక్షలు అందించడం సంతోషకరమన్నారు.






మంత్రి లోకేశ్‌కు విరాళం అందజేస్తున్న పెన్వర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎండీ ఫిలిప్స్ థామస్ తదితరులు ★ శశివిద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తదితరులు

వ్యక్తి/సంస్థ	సాయం (రూ.లలో)
అసోసియేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా	10 లక్షలు
ఎం.అప్పారావు	10 లక్షలు
చిన్మయ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్	10 లక్షలు

✦ అనంతపురానికి చెందిన కేఎం షకిల్ షఫి నేతృత్వంలో ఏపీ వక్ఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ముతావల్లీస్ అండ్ మేనేజింగ్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.7.86 లక్షల విరాళం అందించారు.

✦ జంపాల భావనారాయణ, శారద అనే వృద్ధులు రూ.లక్ష చెక్కు, 16 గ్రాముల బంగారు బ్రేస్‌లెట్‌ని వరద బాధితులకు విరాళంగా ముఖ్యమంత్రికి అందజేసి తమ ఉదారత చాటుకున్నారు.

✦ తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చెన్నపాలెంకు చెందిన పాతూరి కేతన్‌చౌదరి అనే బాలుడు తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేల విరాళాన్ని సీఎంకు అందజేశాడు.



ముఖ్యమంత్రికి విరాళం ఇస్తున్న బెంగళూరుకు చెందిన తెలుగు విజ్ఞాన సమితి ప్రతినిధులు ఎ.రాధాకృష్ణరాజు, ఆర్.ఆదికేశవులునాయుడు తదితరులు



ముఖ్యమంత్రికి విరాళం చెక్కు, 16 గ్రాముల బంగారం అందిస్తున్న వృద్ధులు జంపాల భావనారాయణ, శారద. చిత్రంలో మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి



ఎగువ, దిగువ కాఫర్‌డ్యాం మధ్య నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటు చేసిన పంపులు

పోలవరానికి తగ్గిన వరద

డయాఫ్రంవాల్ నిర్మాణ ప్రాంతంలో నీరు ఎత్తిపోతకు చర్యలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణం నవంబరు నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గోదావరిలో వరద ఉద్ధృతి తగ్గడంతో ప్రధాన డ్యాం ప్రాంతంలోని నీటిని పంపుల ద్వారా బయటకు ఎత్తిపోస్తుండగా.. తాజాగా మరిన్ని పంపులు ఏర్పాటు చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. దిగువ కాఫర్‌డ్యాం వద్ద సోమవారం నాటికి గుత్తేదారు సంస్థ 23 పంపులు ఏర్పాటు చేసి, నీటిని గోదావరిలోకి మళ్లిస్తున్నారు. సుమారు వంద పంపులు ఏర్పాటు చేయాలని నెల రోజుల కిందటే జలవనరుల శాఖాధికారులు గుత్తేదారు సంస్థకు ప్రణాళిక అందజేశారు. మొన్నటి వరకు రెండు కాఫర్‌డ్యాంల మధ్యనున్న నీరు డీప్లింటింగ్ స్లూయిస్ నుంచి నదిలోకి వెళ్లేది. స్లూయిస్ నుంచి నీరు ఆశించిన మేర బయటకు వెళ్లకపోవడంతో పంపులు ద్వారా తోడేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నెలలో విదేశీ నిపుణుల బృందం మరోసారి ప్రాజెక్టు సందర్శనకు రానుంది. ఈలోపు నీరంతా తోడించి, వారు సమగ్రంగా డయాఫ్రంవాల్ ప్రదేశాన్ని చూసేలా సర్వం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కొలికపూడిని సస్పెండ్ చేయాలి

ప్రధాన రహదారిపై మహిళల నిరసన



తిరువూరు మండలం చిట్టేలలో నినాదాలు చేస్తున్న మహిళలు

తిరువూరు, న్యూస్‌టుడే: మహిళా ఉద్యోగుల వాట్సాప్ నంబర్లకు అసభ్యకరంగా సందేశాలు పంపిస్తూ లైంగికంగా వేధిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును తెదేపా అధిష్ఠానం సస్పెండ్ చేయాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని చిట్టేలలో సోమవారం మహిళలు ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళల పట్ల ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

నిజం నిగ్గు తేల్చాలంటున్న ఎమ్మెల్యే: తనపై చేసిన ఆరోపణలు నిజమైతే అరెస్టు చేసి శిక్షించాలని, లేని పక్షంలో ఆరోపణలు చేసిన వారిని శిక్షించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆరోపణలు చేస్తున్న మహిళ ఇప్పటివరకు నాలుగుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించారని, ఆమె భర్తపై పోలీసులు ఎప్పుడు కేసు పెట్టినా ఇలాంటి ఆత్మహత్య నాటకం ఆడుతారని ఆరోపించారు. తనపై పథకం ప్రకారం చేస్తున్న అసత్య ప్రచారాన్ని నియోజకవర్గ ప్రజలు నమ్మబోరని అన్నారు. అధిష్ఠానం ఆదేశాలతో తన దీక్షను విరమిస్తున్నానని ప్రకటించారు.

'జగనన్న తోడు' పథకం పేరు మార్పు

ఈనాడు, అమరావతి: చిరు వ్యాపారుల కోసం ప్రవేశపెట్టిన 'జగనన్న తోడు' పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్చింది. ఆ పథకానికి 'చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు'గా పేరు పెట్టింది. జగనన్న తోడు పథకం పేరు మార్పు కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.


నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే

ఈనాడు, బెంగళూరు: ఎన్నికల బాండ్ల సేకరణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మీద విచారణపై కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. తదుపరి విచారణను అక్టోబరు 22వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ.. ప్రతివాదుల నుంచి అభ్యంతరాలు దాఖలయ్యేంత వరకు ప్రాథమిక విచారణ చేపట్టటం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు ఈ



స్టే అమలులో ఉంటుందన్నారు. ఐపీసీ సెక్షన్లలో బాధితులకు రక్షణ కల్పించే విధానాలున్నాయని, ఈ కేసులో ఫిర్యాదుదారుడు ఎలాంటి బాధితుడూ కాదని వివరించారు. కేవలం ఈ ఫిర్యాదు ద్వారా ఐపీసీ సెక్షన్ 383 వినియోగం గురించి వెల్లడించాలన్న అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసులో మరో నిందితుడు, భాజపా కర్ణాటక శాఖ పూర్వ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్..తనపై కేసు నమోదు చేయవద్దంటూ వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి విచారణ చేపట్టారు. జనాధికార సంఘ్ పరిషత్ సహాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ చేసిన ఫిర్యాదు మేరకు గత శుక్రవారం ప్రత్యేక కోర్టు విచారణకు ఆదేశించింది. శనివారం బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులు నిర్మలా సీతారామన్‌తో పాటు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర తదితరులపై కేసు నమోదు చేశారు.

శాఖలవారీ స్వర్ణాంధ్ర, విశాఖ విజన్ ప్రణాళికలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో డీఆర్వో మోహన్‌కుమార్, జేసీ మయూర్ అశోక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర విజన్-2047తోపాటు విశాఖ విజన్-2029పై శాఖలవారీ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 15శాతం ఆర్థిక వృద్ధి సాధించే దిశగా ప్రణాళికలను సిద్ధం చేసి సీపీఓ (ముఖ్య ప్రణాళిక అధికారి)కి అందజేయాలన్నారు. అక్టోబరు 3 నుంచి 5వ తేదీ వరకు ఆయా ప్రణాళికలపై ప్రజాప్రతినిధులు, భాగస్వామ్య పక్షాలతో సమావేశాలు నిర్వహించి చర్చిస్తామని తెలిపారు.

★ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో వచ్చిన దరఖాస్తులను అక్టోబరు 10వ తేదీలోపు పరిశీలించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అక్టోబరు 2న నగరానికి రానున్నారు. హైదరాబాద్‌లో ఉదయం 8 గంటలకు బయల్దేరి 9.25 గంటలకు విశాఖ చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పిస్తారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని మహాత్ముని విగ్రహానికి వినతిపత్రం అందజేస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉక్కు కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ సంఘం నాయకులు చేస్తున్న ఆందోళనలో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళ్లనున్నారు.

సైనిక సంక్షేమ నిధికి రూ.4.45 లక్షల వితరణ



కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీలకు చెక్కు అందజేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: సైనిక సంక్షేమ నిధికి జిల్లా మహిళా సమాఖ్య రూ.4,45,127లు వితరణగా ఇచ్చింది. మహిళా సమాఖ్య సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి చెక్కు అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ శోభారాణి మాట్లాడుతూ జిల్లాలోని 4800 మహిళా సంఘాలు కలిసి ఈ సహాయం అందించాయన్నారు. జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

పోలీసుల కళ్లుగప్పి గంజాయి నిందితుడి పరార్

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: పోలీసులు కళ్లుగప్పి గంజాయి నిందితుడు పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు గత నెల 28న దువ్వాడ రైల్వే స్టేషన్‌వద్ద నిఘా వేసి అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన అరడ శివకుమార్ (23) మరో బాలుడ్ని అదుపులోకి తీసుకొని 21 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని దువ్వాడ శాంతి భద్రతల పోలీసులకు అప్పగించారు. ఆదే రోజు అర్ధరాత్రి సమయంలో స్టేషన్‌లో ఉన్న శివకుమార్ రాత్రి విధుల్లో ఉన్న పోలీసులు కళ్లుగప్పి పరారయ్యాడు. అప్పటినుంచి పోలీసులు ఈ సంఘటనను గోప్యంగా ఉంచి మూడు బృందాలతో గాలిస్తున్నా నేటికీ ఆచూకీ తెలియరాలేదు. ఈ ఘటనపై నగర కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బాలుడ్ని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వనితల చేతిలో 'చక్రం'

"బజారుకు వెళ్లి కూరగాయలు తేవడం.. పిల్లలను పాఠశాలలో దిగబెట్టడం.. ఉద్యోగానికి వెళ్లడం.. ఇలా పలు పనులు మహిళలే స్వయంగా చేసుకుంటున్నారు. వాటికి ప్రజా రవాణాపై ఆధారపడితే కష్టమే. దీంతో డ్రైవింగ్ కూడా నిత్యావసరంగా మారింది. అధిక శాతం గృహిణులు వాహనాలు నడపడం నేర్చుకుంటున్నారు. ద్విచక్ర వాహనాలే కాదు.. వంట గదిలో గరిటె తిప్పినంత సులువుగా కారు స్టీరింగ్ తిప్పేస్తున్నారు. లైసెన్సులు పొంది తమ సత్తా చాటుతున్నారు."

ఈనాడు డిజిటల్, విశాఖపట్నం, న్యూస్‌టుడే, మాధవధార

★ నగరానికి శివారు ప్రాంతాల్లో పలు ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలున్నాయి. అక్కడ పనిచేసే మహిళా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు చాలా మంది సొంత వాహనాలపైనే వెళ్తున్నారు.

డ్రైవింగ్‌లో శిక్షణకు ఆసక్తి



70 ఏళ్ల వయసులో..

పెందుర్తికి చెందిన అనురాధకు 70 ఏళ్లు. ఇటీవల మనవరాలితో కలసి స్థానికంగా ఉన్న డ్రైవింగ్ స్కూల్‌కు వచ్చారు. ఆ వయసులోనూ చాలా ఉత్సాహంగా శిక్షణ పూర్తిచేయడంతోపాటు లెర్నింగ్ లైసెన్స్ పొందారు. 'చిన్ననాటి నుంచి కారు నడపాలనే కోరిక ఉండేది. ఇప్పటికది నెరవేరింది' అని ఆమె చెబుతున్నారు.

కారు నడపాలనే ఆశతో..

నేను ద్విచక్ర వాహనం నడపగలను. కారు నడపాలనే ఆసక్తితో శిక్షణ తీసుకున్నా. తొలి అయిదు రోజులు రహదారి నిబంధనలపై తరగతులు నిర్వహించారు. అనంతరం సిములేటర్‌పై, కారుతో శిక్షణ ఇచ్చారు.

–సీహెచ్ అనురాధ, గృహిణి, మర్రిపాలెం వుడాకాలనీ

విశాఖ నగరంలో వాహనాలు నడుపుతున్నవారిలో 35 శాతం మంది మహిళలే.

బాధ్యతగా నడుపుతున్నారు..

ఇంట్లో పురుషులు ఫోన్ చేసి తమ కుమార్తె లేదా భార్యకు నేర్పించాలని అడుగుతున్నారు. ఇటీవల ఓ ఇంగ్లిష్ మ్యాగజైన్ చేసిన సర్వేలో పురుషులతో పోలిస్తే మహిళలు బాధ్యతగా వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. వారు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలూ తక్కువే. – రాధిక బెహర, శిక్షకులు



అందుబాటులో నాలుగు కోర్సులు..

ద్విచక్ర వాహనం నడపటంపై అవగాహన ఉన్న మహిళలు కారు డ్రైవింగ్ వేగంగా నేర్చుకుంటున్నారు. మిగిలినవారికి కొంత సమయం పడుతుంది. మా వరుణ్ గ్రూప్‌లో 10, 21, 26, 31 రోజుల కోర్సులున్నాయి. ఎక్కువ మంది 21 రోజుల కోర్సుపై ఆసక్తి కనబరుస్తున్నారు. – హరి సంతోష్, శిక్షకులు



డ్రైవింగ్ స్కూల్‌లో సిములేటర్‌పై శిక్షణ పొందుతున్న మహిళ

★ ఇటీవల కాలంలో ప్రతి కంపెనీ ఆటోగేర్ కార్లను ప్రవేశపెడుతున్నాయి. నగరాల్లో మహిళలు వీటిని నడిపేందుకు చాలా అనుకూలంగా ఉంటున్నాయని చెబుతున్నారు.

విశాఖ ఆర్టీఏ కార్యాలయంలో లైసెన్సులు పొందిన మహిళలు

2022–23లో	3,203
2023–24లో	3,818

అతివల సంఖ్యే ఎక్కువ: వరుణ్ మారుతి గ్రూప్‌నకు విశాఖ జిల్లాలో పెందుర్తి, మురళీనగర్, సిరిపురం, గాజువాకలో బ్రాంచీలున్నాయి. నెలకు 200 మందికిపైగా శిక్షణ ఇస్తున్నారు. అందులో 60 శాతం మహిళలే. డ్రైవింగ్ నేర్చుకున్న వారందరూ లైసెన్సు తీసుకుంటున్నారు. డ్రైవింగ్ అవసరాన్ని ఉపాధిగా మార్చేందుకు విశాఖకు చెందిన రాధిక బెహర 'ఫెమిరైడ్స్' అనే సంస్థను స్థాపించారు. మహిళలకు రక్షణగా ప్రత్యేక వాహన సేవలు అందిస్తున్నారు. లైసెన్స్ ఉంటే మహిళలకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పిస్తారు. మార్చి నుంచి కారు నేర్పుతున్నారు. ఇప్పటి వరకు 80 మందికిపైగా నేర్చుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 303 అర్జీలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 303 మంది వచ్చి అర్జీలు అందజేశారు. కలెక్టర్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాఖల వారీ వచ్చిన అర్జీలు	
☛ రెవెన్యూ	: 90
☛ జీవీఎంసీ	: 63
☛ పోలీసు	: 17
☛ ఇతర శాఖలకు	: 133

మహిళా వసతిగృహాన్ని ఆనుకొని లాడ్జి: ★ జీవీఎంసీ 29వ వార్డు పరిధి కృష్ణానగర్ ప్రాంతంలో ఏయూ మహిళా వసతిగృహాన్ని ఆనుకొని ఉన్న నివాస సముదాయాల్లో లాడ్జి నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అధికారి వేధింపులపై ఫిర్యాదు: ★ మధురవాడ శిల్పారామంలో పనిచేస్తున్న ఓ అధికారి, ఓ జూనియర్ సహాయకురాలు తనను కులం పేరుతో దూషిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని అక్కడ జూనియర్ సహాయకురాలిగా పనిచేస్తున్న మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని, విధులు ముగిసిన తర్వాత కూడా ఉండాలని చెబుతున్నాడన్నారు. రాత్రి 8గంటల వరకు ఉంచుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.



వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

ఆరు నెలల తర్వాత మేయర్‌పై అవిశ్వాసం

కూటమి కార్పొరేటర్లతో ఎంపీ శ్రీభరత్



కూటమి కార్పొరేటర్లతో సమావేశమైన ఎంపీ శ్రీభరత్

కార్పొరేషన్, వన్‌టౌన్ న్యూస్‌టుడే: ఆరు నెలలు ఆగితే మేయర్‌పై అవిశ్వాసం పెట్టి మార్చేద్దామని ఎంపీ శ్రీభరత్ అన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ అధికారులు, కమిషనర్‌తో సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం తెదేపా కార్యాలయంలో కూటమి కార్పొరేటర్లతో ఎంపీ శ్రీభరత్ సమావేశమయ్యారు. ప్రభుత్వం మారినా అవినీతి యథాతథంగా కొనసాగుతోందని కార్పొరేటర్లు అభిప్రాయపడ్డారు. శ్రీభరత్ మాట్లాడుతూ మేయరుకు ఉన్న విశేషాధికారాలతో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మేయరు చేత రాజీనామా చేయించడం సాధ్యం కాదని, ఆరు నెలలు వేచి ఉండాలని, అనంతరం అవిశ్వాసం పెట్టి తొలగిద్దామని వివరించారు. వైకాపా హయాంలో పనిచేసిన అధికారులే ఇంకా ఉన్నారని, వారిని పంపించేయాలని కార్పొరేటర్లు సూచించారు. పార్టీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచార యత్నం కేసులో ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచార యత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి జి.ఆనందిని తీర్పునిచ్చారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. పోక్సో న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి జిల్లా మునగపాక మండలం, వెంకన్నపాలెం శివారు ప్రాంతానికి చెందిన బండారు రమణ లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. అతనుంటున్న ప్రాంతంలో ఓ బాలిక(8) కుటుంబ నివశించేది. 2019 ఫిబ్రవరి 10న మధ్యాహ్నం బాలిక తండ్రి ఇంటికి వచ్చాడు. కుమార్తె కనిపించకపోవడంతో గట్టిగా పిలిచాడు. సమీప ఇంట్లోంచి కుమార్తె ఏడుస్తూ రావడం గమనించి ఏం జరిగిందని ప్రశ్నించాడు. సెల్‌ఫోన్‌లో పలు అసభ్యకర దృశ్యాలు చూపించాడని, తర్వాత అత్యాచారం చేయబోగా ఏడవడంతో విడిచిపెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు బాధితురాలి తల్లిదండ్రులు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని న్యాయస్థానంలో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

భీమిలి

సినిమాలు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - సత్యం సుందరం
రాములమ్మ- దేవర,
తాతా - దేవర, సప్తగిరి- దేవర
మహరాజ్ (ఆనందపురం) - దేవర

రైతు బజార్ వినియోగంలోకి తేవాలి

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, తదితరులు భీమిలి జోనల్ కమిషనరు ప్రేమ ప్రసన్నవాణికి సోమవారం విన్నవించారు. ఆరు నెలల కిందట దీన్ని ప్రారంభించేసినప్పటికీ నేటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా చిట్టివలస, తగరపువలస శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: శిరుగుడినగర్(ఎండాడ)లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగక ఇక్కట్లకు గురవుతున్నాం. - కొండలరావు, శిరుగుడినగర్
సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: సాయిప్రియ రిసార్ట్స్(రుషికొండ) నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే రహదారి గోతులమయంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- స్థానికులు, రుషికొండ
సమాధానం: రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - నరేష్, ఇంజినీరింగ్ ఏఈ

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: శ్రీరామ్ ప్రాపర్టీస్(ఎండాడ)కు వెళ్లే దారిలో వాహనాలతో ఎక్కడికక్కడ వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో రాకపోకలకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. - పి.వెంకట్రావు, ఎండాడ
సమాధానం: వ్యర్థాలు వేసే వాహనాలపై కేసులు నమోదు చేస్తాం.
- సింహాచలం నాయుడు, జోన్-2 కమిషనర్

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం

'న్యూస్‌టుడే'తో భీమిలి సీఐ సుధాకర్ ముఖాముఖి





తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని అలాంటివారి పట్ల చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని భీమునిపట్నం పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొడ్డేపల్లి సుధాకర్ అన్నారు. రౌడీషీటర్లు, గంజాయి ముఠాలపై దృష్టి పెట్టామని, పర్యాటక ప్రాంతాల్లో భద్రతకు పెద్దపీట వేశామన్నారు. జాతీయ రహదారి, భీమిలి, తగరపువలస, బీచ్‌రోడ్డులలో నేరగాళ్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి అసాంఘిక శక్తుల ఆట కటిస్తామన్నారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తగరపువలస, భీమిలి, మజ్జివలస సెక్టార్లుగా విభజించాం. సెక్టార్ల వారీగా ఎస్‌ఐలకు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించాం. మొబైల్ టీంలతో గస్తీ పెంచాం. ఎన్‌ఫోర్సుమెంటు విభాగాన్ని పటిష్ఠం చేశాం. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలు, శుభకార్యాల్లో పెద్ద పెద్ద శబ్దాలు, అశ్లీల నృత్యాలు లేకుండా ఉండాలి. మైక్ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

★ రౌడీషీటర్లు ఇక్కడ నివాసముంటూ నగరంలోని పలుచోట్ల గతంలో నేరాలకు పాల్పడ్డారు. ఇలాంటివి పునరావృతం కాకుండా వీరి కదలికలపై నిఘా ఉంచాం. వీరు ఎలాంటి వివాదాల్లో తలదూర్చినా చర్యలు తప్పవు. ప్రభుత్వం చేపట్టిన వందరోజుల కార్యాచరణలో భాగంగా గతంతో పోల్చుకుంటే గంజాయి, డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని దాదాపుగా నియంత్రించాం. జూదం, గుట్కా, కోడిపందాలు, బహిరంగ మద్యపానం, బైక్‌రేస్‌ల నిరోధంపైనా ప్రత్యేక దృష్టి సారించాం.

సిబ్బంది వివరాలు

సర్కిల్ ఇన్‌స్పెక్టరు-1,
సబ్ ఇన్‌స్పెక్టర్లు-2,
అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు-3,
హెడ్ కానిస్టేబుళ్లు-7,
మొత్తం కానిస్టేబుళ్లు-21, హోంగార్డులు-8

★ మహిళల భద్రత కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. మహిళా కానిస్టేబుళ్లతో కళాశాలలు, మార్కెట్లు, రద్దీ కూడళ్లలో గస్తీ నిర్వహిస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. ర్యాగింగ్ నివారణకు కమిటీలు వేసి చట్టాన్ని అతిక్రమిస్తే ఎదురయ్యే దుష్పరిణామాలు చెబుతున్నాం. ★ విశాఖ నగరంలో భీమిలి కీలక ప్రాంతం కావడంతో భూవివాదాలు, కొట్లాట కేసులు కొన్నేళ్లుగా నమోదయ్యాయి. భూ వివాదాలను రెవెన్యూ, న్యాయస్థానాల్లో తేల్చుకోవాలని సూచిస్తున్నాం. భార్యాభర్తల గొడవల్లో కౌన్సెలింగుకి ప్రాధాన్యమిస్తూ అప్పటికీ పరిష్కారం కాకుంటే కేసులు నమోదు చేస్తున్నాం.

★ సంచార బృందాలు (మొబైల్ టీంలు)
★ రోడ్డు భద్రతా వాహనం-(ఏఎస్‌ఐ, హెచ్‌సీ, కానిస్టేబుల్)
★ సబ్ కంట్రోల్(1)- బీచ్ రోడ్డులోని తొట్లకొండ
★ అవుట్ పోస్టులు (2)- తగరపువలస కూడలి, జాతీయ రహదారి వేంకటేశ్వరమెట్ట ★ రక్షక్-1, బ్లూకోట్ బృందాలు-2, డీకోల్ట్స్ (క్రైం)-1, ట్రాకోల్ట్స్-1 (ట్రాఫిక్) ★ నైట్ బీట్‌లు- లా అండ్ ఆర్డర్-4, క్రైం-1 ★ ప్రయివేటు సీసీ కెమెరాలు-1706 ★ ముఖ్య కూడళ్లు, రహదారులపై కెమెరాలు-110

తొట్లకొండ అవుట్‌పోస్టులో 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉంటారు. బీచ్ పెట్రోలింగు వాహనం భీమిలి-తిమ్మాపురం మధ్య 12 కి.మీ.ల వరకూ నిత్యం గస్తీ ఉంటుంది. పిక్నిక్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎర్రమట్టిదిబ్బలు, తొట్లకొండ, భీమిలి బీచ్‌లలో ప్రత్యేక సిబ్బందితో పాటు సంచార బృందాలు (మొబైల్ టీం) తిరుగుతున్నాయి. ట్రాఫిక్, నేర విభాగాల ఎస్‌ఐలు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలు పరిరక్షిస్తున్నాం. బీచ్‌లో స్నానాలకు దిగే వారు ప్రమాదాలకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు పెట్టి గస్తీ కూడా ఉంచుతున్నాం.

తొట్లకొండ అవుట్‌పోస్టులో 24 గంటలూ సిబ్బంది విధుల్లో ఉంటారు. బీచ్ పెట్రోలింగు వాహనం భీమిలి-తిమ్మాపురం మధ్య 12 కి.మీ.ల వరకూ నిత్యం గస్తీ ఉంటుంది. పిక్నిక్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎర్రమట్టిదిబ్బలు, తొట్లకొండ, భీమిలి బీచ్‌లలో ప్రత్యేక సిబ్బందితో పాటు సంచార బృందాలు (మొబైల్ టీం) తిరుగుతున్నాయి. ట్రాఫిక్, నేర విభాగాల ఎస్‌ఐలు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలు పరిరక్షిస్తున్నాం. బీచ్‌లో స్నానాలకు దిగే వారు ప్రమాదాలకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు పెట్టి గస్తీ కూడా ఉంచుతున్నాం.

భీమిలి స్టేషన్‌లో అయిదేళ్లలో నమోదైన కేసులు

ఏడాది	నమోదైన కేసులు
2020	555
2021	571
2022	586
2023	547
2024 (ఇప్పటివరకూ)	402

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు

స్టేషన్ సీఐ: 94409 04712
పోలీసు స్టేషన్: 0893 3229533
ఎస్‌ఐ హరీష్ (తగరపువలస, మజ్జివలస సెక్టార్లు) - 99498 06659
ఎస్‌ఐ గౌరీ (భీమిలి సెక్టారు)-73822 96910
క్రైం ఎస్‌ఐ సూర్యప్రకాశరావు- 73826 41999
ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి- 93905 96569

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు

మధురవాడ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేస్తున్న 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, జనసేన పార్టీ భీమిలి మండలాధ్యక్షుడు నక్కా శ్రీధర్ ఒకరోజు ఉపవాస దీక్ష చేపట్టారు. నగరంపాలెం రోడ్డులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుగా స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో కూర్చుని రోజంతా ఉపవాసంతో దీక్ష చేపట్టారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేసి కల్తీ ప్రసాద దోషులను శిక్షించాలని భగవంతుడిని వేడుకున్నారు. నాయకులు వాండ్రాసి కొండయ్య, ఇల్లిపిల్లి నానాజీ, కొర్రాయి సురేష్, ఆకుల శివ, బైరెడ్డి చిట్టి, ఇమంది శ్రీను, వీర మహిళలు పాల్గొన్నారు.



ఉపవాస దీక్షలో వేంకటేశ్వరస్వామికి పూజిస్తున్న నక్కా శ్రీధర్ తదితరులు

నిందితులను శిక్షించాలి

ఎండాడ, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం ఘటనలో నిందితులను శిక్షించాలని ఎండాడ బీసీ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం దీపారాధన నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు చెట్టిపిల్లి గోపి, భాజపా వార్డు అధ్యక్షుడు సీహెచ్.నాగరాజు, కూటమి నాయకులు, జనసేన వీర మహిళలు పాల్గొన్నారు.



దీపారాధనలో పాల్గొన్న కూటమి నాయకులు, స్థానికులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేస్తున్న దీక్షకు మద్దతుగా జనసేన ఆరోవార్డు అధ్యక్షుడు జి.సంతోష్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం పీఎంపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన చేశారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి కనకారావు, మహిళా సమన్వయకర్తలు ప్రమీలరాణి, సన్నయ్యమ్మ, జనసైనికులు దుర్గాప్రసాద్, దత్తు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల ఆకాంక్షను కాపాడతాం

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కార్మికుల ఆకాంక్షలు కాపాడేందుకు కృషి చేస్తున్నామని, ఒప్పంద కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తున్నట్లు విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో పోరాట కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉక్కులో నెలకొన్న అనిశ్చితి, ఆర్థిక విధ్వంసం, ఉద్యోగుల కార్మికుల ఆందోళన, నష్టాలపై ఆయా నెట్టే పరిస్థితిని నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఏదో తేదీ లోపు నూతన ఇంఛార్జి సీఎండీని కలసి అన్ని అంశాలపై చర్చలు జరుపుతానన్నారు. కార్మికులు చేస్తున్న ఆందోళనలు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఉద్యోగుల తొలగింపు, ఆర్థిక అంశాలు ఈ సమయంలో అమలు చేయడం సరైన విధానం కాదన్నారు. ఈ మధ్య జరిగిన ఒప్పంద కార్మికుల తొలగింపు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి దృష్టిలో లేదని ఈ విషయమై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, విళ్లారామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, డి.అప్పారావు, మసేనురావు, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.



ఉక్కు పోరాట కమిటీ నాయకులతో విశాఖ ఎంపీ శ్రీభరత్

తెదేపా సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టి భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని పార్టీ యువ నాయకుడు గంటా రవితేజ పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీలోని ఓ ప్రయివేటు మండపంలో సోమవారం నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో జరిగిన ముందస్తు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు చేసుకునే అవకాశం పార్టీ కల్పించిందన్నారు. ఈ సందర్భంగా ఆండ్రాయిడ్ పోర్టల్ సభ్యత్వ నమోదు విధానం తీరుతెన్నులను బదిలీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పిళ్లా వెంకట్రావు, గాడు వెంకటప్పడు, మొల్లి లక్ష్మణరావు, చెట్టిపిల్లి గోపి, డీఏఎన్.రాజు, గాడు చిన్నికుమారిలక్ష్మి, గంటా నూకరాజు, దాసరి శ్రీనివాస్, వై.జీవన్‌కుమార్, బి.దొరబాబు, గరే గురునాద్, కె.దామోదరరావు, మన్యాల సోంబాబు, కె.అచ్యుతరావు, ఈగల రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంటా రవితేజ

అ వీ ఇ వీ

వినతుల స్వీకరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 11 వినతులు వచ్చాయి. ఈ మేరకు జెడ్సీ పి.పి.ప్రసన్నవాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగానికి తొమ్మిది, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. వాటిని పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు బదలాయించినట్లు జెడ్సీ పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. భీమిలి గ్రామీణంలో 6,118 మందికి రూ.2.54 కోట్లు, ఆనందపురంలో 8746 మందికి రూ.3.70 కోట్లు, పద్మనాభంలో 7875 మందికి రూ.3.21 కోట్లు, జోన్-1 భీమిలి అర్బన్‌లో 8656 మందికి రూ.3.69 కోట్లు, జోన్-2 మధురవాడలో 20,255 మందికి రూ.8.78 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేయనున్నారు. మంగళవారం వేకువజామున అయిదు గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు భీమిలి జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి, ఎంపీడీవో ఎన్.హనుమంతరావు తెలిపారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత

ఎండాడ, న్యూస్‌టుడే: హయగ్రీవ బిల్డర్ చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు గణేషనగర్(ఎండాడ)వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. కాలనీకి వెళ్లే మార్గం మూసేసి నిర్మాణం చేపట్టారని, సామాజిక భవనానికి కేటాయించిన స్థలాన్ని సైతం ఆక్రమించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా పనులను అడ్డుకుని సమస్యను తహసీల్దార్‌కు వివరించినట్లు కాలనీ అధ్యక్షుడు పి.అప్పలరాజు, కార్యదర్శి భాస్కర్ తదితరులు పేర్కొన్నారు.

నిందితులకు జరిమానా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిపై కేసులు నమోదు చేయగా వారికి ఆబ్కారీ ప్రత్యేక జ్యుడిషియల్ విభాగం జరిమానా విధించినట్లు పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.12 వేల మధ్య అపరాధ రుసుం; బి.వెంకటరమణ అనే వ్యక్తికి మూడు రోజుల సాధారణ కారాగార శిక్ష, రూ.50 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ..

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అర్జీదారుల నుంచి 12 వినతులు స్వీకరించినట్లు జెడ్సీ పి.సింహాచలం పేర్కొన్నారు. బక్కన్నపాలెం శ్మశానవాటికలో అవసరమైన వసతులు కల్పించాలని షేక్‌సుభాని కోరారు. నగరంపాలెం మాస్టర్‌ప్లాన్ రహదారి పనులను పూర్తి చేయాలని సీపీఐ నాయకులు వాండ్రాసి సత్యనారాయణ తదితరులు విజ్ఞప్తి చేశారు. జనసేన 5, 6, 7 వార్డుల అధ్యక్షులు దేవర శివ, సంతోషినాయుడు, నాగోతి నర్సింహనాయుడు, పౌరసంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పలువురు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జెడ్సీని సత్కరించి ఆయా వార్డుల్లోని సమస్యలు తెలియజేశారు.

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి సోమవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాల భోగం సేవలు జరిపారు. దేవదేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు(సాగర్‌నగర్)లో కొలువైన మొగదారమ్మ మహాలక్ష్మీ పద్మాలయ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సూరపనేని ఇన్షుప్రసాద్ తెలిపారు. అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అమ్మవారు వివిధ అవతారాల్లో దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, పుష్పార్చనలు, హోమాలు వంటివి వైభవంగా జరుగుతాయని, 6వ తేదీన చండీ హోమం ఉంటుందని పేర్కొన్నారు. ★ ఎండాడ దుర్గాదేవి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రతి రోజు వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరుగుతాయన్నారు.



మొగదారమ్మ అమ్మవారు

గరుడ వాహనంపై గోవిందుడి వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో సోమవారం గరుడ సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువు దీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామాలతో అర్చించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కళాశాలలో కార్యశాల

కొమ్మాది: పీఎంపాలెం బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్‌వైజాగ్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడురోజుల కార్యశాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్వీఎస్ గ్లోబ్ టెక్నాలజీ సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ కె.వి.నవీన్‌కుమార్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం అతిథిని సత్కరించారు.

నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు: ఏడీ

స్పందనకు వందనం

కొమ్మాది, న్యూస్‌టుడే: వివిధ ట్రేడుల్లో శిక్షణ పొందుతున్న దివ్యాంగ విద్యార్థులకు రుచికరమైన భోజనం సమకూర్చకుంటే చర్యలు తప్పవని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు (ఏడీ) జె.మాధవి హెచ్చరించారు. బక్కన్నపాలెం ఐటీఐ శిక్షణ ఉత్పత్తి కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో 'ముద్దన్నం.. నీళ్లచారే దిక్కు..' శీర్షికన సోమవారం వెలువడిన కథనానికి ఏడీ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ మెనూ తప్పకుండా పాటించాలని, రక్షిత మంచినీరు అందించాలని, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ప్రిన్సిపల్ భాస్కర్‌రావుకు సూచించారు. ఇక్కడి వసతిగృహాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. దాతలు స్పందించి ఇక్కడి దివ్యాంగ విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

పద్మనాభం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఒకరు కత్తితో దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాత కొవ్వాడ గ్రామానికి చెందిన తమరాన నారాయణ మూర్తి (50) తన అత్తింటి ఊరు పెంట గ్రామంలో ఆదివారం గ్రామ శివారున ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ద్విచక్ర వాహనం తీస్తుండగా అదే గ్రామానికి చెందిన దేవరపల్లి పైడిరాజు (35) వెనక నుంచి ఆయనపై కత్తితో దాడి చేయగా తలకు గాయమైంది. అతడిని హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. భూముల విషయమై కొన్నేళ్లుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో పలుమార్లు పరస్పరం కేసులు పెట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పైడిరాజు, అతనికి సహకరించిన దేవరపల్లి గణేష్, బోని చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన నారాయణమూర్తి


జల క్రీడల పోటీల్లో ప్రతిభ



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

మధురవాడ, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని దేవాస్ వేదికగా ఇటీవల జరిగిన 9వ జాతీయస్థాయి 'కానో పోలో' జల క్రీడల పోటీల్లో ఏపీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఎంపీ జట్టుతో జరిగిన పోటీలో రాష్ట్ర జూనియర్ బాలుర జట్టు విజయం సాధించి రజత పతకం కైవసం చేసుకున్నారు. దిల్లీ జట్టుపై పోరాడి కాంస్య పతకం సాధించారు. ఏపీ నుంచి మొత్తం 16 మంది సభ్యులు పతకాలు అందుకున్నారు. ఒక్కో జట్టులో సభ్యులైన 8 మంది ప్రతిభతో పోరాడి విజయాలు దక్కించుకున్నారని కెనోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ (సీకేఏపీ) అధ్యక్షులు బి.బలరాంనాయుడు తెలిపారు. ఈ పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ(ఎస్ఏఏపీ) మద్దతుగా నిలిచిందన్నారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన వాటర్ స్పోర్ట్స్ శిక్షకులు ఎం.శ్రీను కృషిని అభినందించారు.

ఎరుసుపేట యువకుడికి కాంస్య పతకం



చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: ఆలిండియా పోలీసు గేమ్స్ బాక్సింగులో చిట్టివలస సమీప ఎరుసుపేట గ్రామానికి చెందిన **మజ్జి తరుణ్(24)** కాంస్య పతకం సాధించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఇటీవల జరిగిన పోటీల్లో 51 కిలోల విభాగంలో బరిలోకి దిగి ఈ ఘనత చాటారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు సహస్ర సీమాబల్‌లో జనరల్ డ్యూటీ (జీడీ)గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. తరుణ్ జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించడంతో ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని ఎం.లావణ్య రాష్ట్ర స్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని బాలామణి ఒక ప్రకటనలో తెలిపారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గుడిలోవ విద్యార్థిని..



బి.హారిణి

ఆనందపురం, న్యూస్‌టుడే: గుడిలోవ శ్రీసరస్వతి విద్యా విహార్ విద్యాలయంలో ఆరో తరగతి విద్యార్థిని బి.హారిణి జాతీయస్థాయి మల్లఖంబ పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయ అధికారులు తెలిపారు. ఇటీవల కర్ణాటకలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో ఈమె చక్కటి ప్రతిభ కనబర్చి.. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత బాలికను పలువురు అభినందించారు.

ఉపాధి పనులపై కేంద్ర బృందం ఆరా..

పద్మనాభం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం (నేషనల్ లైవ్లీ మోనటరింగ్ టీమ్) సోమవారం పద్మనాభం మండలంలో పర్యటించింది. అయినాడ, కోరాడ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు పరిశీలించింది. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. స్వయం సహాయక బృందాల సభ్యులతో సమావేశమై డ్వాక్రా సంఘాల నిర్వహణ తీరు తెన్నులు అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో అనిల్ గైక్వాడ్ తదితరులు ఉన్నారు. డీపీఎం సంజయ్, వైదేహి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, ఈవోఆర్డీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోరాడ సచివాలయం వద్ద అధికారులు

మేమింతే.. నచ్చినట్టు దూసుకుపోతాం

దర్పణం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం కూడలి వద్ద ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల రాకపోకలతో ద్విచక్రవాహదారులు, పాదచారులు నిత్యం భయాందోళనకు లోనవుతున్నారు. జాతీయ రహదారిపై నగరం నుంచి మధురవాడ వైపు వెళ్లే బస్సులు, కార్లు కూడలిలో సిగ్నల్ వద్ద ఆగకుండా సేవా మార్గం మీదుగా దూసుకొస్తున్నారు. ఒక్క నిమిషం సిగ్నల్ వద్ద ఆగేందుకు సమయం వెచ్చించలేక నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్నారు. బి-మైదానం వద్ద నుంచి సేవామార్గం వైపు తిరిగి స్టేడియం గేటు ఎదురుగా కూడలి నుంచి జాతీయ రహదారిలోకి వెళ్తున్నారు. దీంతో సిగ్నల్ కోసం అక్కడ వేచి ఉన్న ద్విచక్రవాహనదారులు బస్సుల రాకపోకలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మధురవాడ నుంచి నగరం వైపు వెళ్లే వాహనాల పరిస్థితి కూడా అలానే ఉంది. కూడలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బంది ఉన్నా భారీ వాహనదారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



స్టేడియం కూడలి సర్వీస్ రోడ్డు వద్ద ఇలా..

కళింగ బీచ్‌లో పరిశుభ్రత

ఐఎన్ఎస్ కళింగ(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: జీవీఎంసీ భీమిలి జోన్, తూర్పు నావికాదళ స్థావరం ఐఎస్ఎస్ కళింగ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ కళింగ బీచ్‌ను నావికాదళ ఉద్యోగులు, జీవీఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. జోనల్ కమిషనరు ప్రేమ ప్రసన్నవాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మీనాయుడు, ఏపీడీ సంతోశ్‌కుమార్, ఐఎన్ఎస్ కళింగ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ✶ భాజపా ఆధ్వర్యంలో చేపల తిమ్మాపురం తీరంలో స్వచ్ఛసాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాజపా నగర అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు దోని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



తీరంలో సేకరించిన వ్యర్థాలతో ఉద్యోగులు, సిబ్బంది

విశాఖ తూర్పు

2న హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో జరిగే సీనియర్ పురుషుల అంతర జిల్లా హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విశాఖ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఈనెల 2న హ్యాండ్‌బాల్ పురుష అభ్యర్థుల ఎంపికలు జరుగుతాయని సంఘం కార్యదర్శి ఎస్.రాజారావు తెలిపారు. బుధవారం సాయంత్రం సాలిగ్రామపురం పోర్టు హైస్కూలు మైదానంలో జరిగే ఎంపికలకు హ్యాండ్‌బాల్ సీనియర్ పురుష క్రీడాకారులు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 85006 82989, 70130 70676) నెంబర్లను సంప్రదించాలన్నారు.

అ వీ ఇ వీ

ఉత్సాహంగా విజన్-2047 పోటీలు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థలో 2047 నాటికి వివిధ అంశాల్లో తీసుకురావాల్సిన మార్పుల గురించి విద్యార్థులకు విజన్ 2047 పేరిట మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, బృంద చర్చ పోటీలు నిర్వహించారు. డీఈఓ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని 11 మండలాల నుంచి 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మందిని జిల్లాస్థాయికి ఎంపికచేశారు. వీరిని డీఈఓ చంద్రకళ అభినందించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎమ్ఓ లక్ష్మి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలైన విద్యార్థులతో డీఈఓ చంద్రకళ

శీతోష్ణస్థితి వేడెక్కకుండా మొక్కలు నాటాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : శీతోష్ణస్థితి వేడెక్కకుండా యువత కృషి చేయాలని సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్ జీవీఎంసీ ప్రాజెక్టు ఇంజినీర్ వివేక్ కోరారు. సోమవారం ఉదయం ఎంవీపీకాలనీ ఎస్.వి.వి.పి. వి.ఎం.సి. డిగ్రీ కళాశాలలో వ్యాస్ స్వచ్ఛంద సంస్థ, ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫర్ క్లైమెట్ చేంజ్ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రిన్సిపల్ జగదీష్, ఉప ప్రిన్సిపల్ అప్పారావు, ఎన్ఎస్ఎస్ పి.ఓ. రాణిప్రియాంక, ఎకో వారియర్ జె.వి.రత్నం, పర్యావరణ వాలంటీర్లు రవితేజ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న వివేక్, విద్యార్థులు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : తూర్పు నియోజకవర్గం జోన్-2లో 9 నుంచి 13 వార్డులకు నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, అందువల్ల కొత్త పైపు లైన్ ద్వారా నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రాష్ట్ర పురపాలక శాఖమంత్రి నారాయణను కోరారు. సోమవారం అమరావతిలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. విస్కో ప్రాజెక్టు అమల్లోకి వస్తే 9 నుంచి 13 వార్డులు, కొండవాలు వారికి నీటి ఇక్కట్లు తప్పుతాయన్నారు. అందువల్ల కొత్త ప్రాజెక్టును అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

స్పందించారు... తీగలు తొలగించారు..

ఈనాడు కథనానికి స్పందన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: 'తీగలా? పిచ్చుక గూళ్లా' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో వచ్చిన వార్తకు ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాలతో పదోవార్డు పరిధిలోని సుందర్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఏఈ శ్వేత, సిబ్బందితో కలిసి తీగలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.


తీగలు తొలగించిన తరువాత..

సామాన్యులకు నాణ్యమైన విద్య

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: జార్జియా విశ్వవిద్యాలయంలో సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని డాక్టర్ బుదాస్ వల్లి తెలిపారు. పెదవాల్తేరు చిన్మయా మార్గ్ దరి జీవీ స్క్వేర్ భవనంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్‌లో అర్హత సాధించిన వారు జార్జియాలో వైద్య విద్యలో చేరేందుకు అర్హులన్నారు. కార్యక్రమంలో మాజీ ఎం.ఎల్.సి. పి.వి.ఎన్.మాధవ్, సంస్థ ప్రతినిధులు వివేకానంద మూర్తి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం..

- విజయవంతంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం
- జోన్-3 జెడ్సీ శివప్రసాద్



"కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ వెల్లడించారు. జోన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు మరింత మెరుగ్గా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. జోన్-3 జెడ్సీగా బాధ్యతలు చేపట్టిన ఆయన పలు అంశాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.."

– న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

ఉద్యానవనాలు, బీచ్ శుభ్రతకు ప్రాధాన్యం: గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2 వరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. 15 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఇప్పటికే ఉద్యానవనాలు, బీచ్ ప్రాంతాన్ని శుభ్రంచేశాం. అప్పుఘర్ దరి లుంబినీపార్కుతో పాటు వై.ఎం.సి.ఎ. పరిసరాలు పరిశుభ్రతను చేపడుతున్నాం.

తీరంలో మొక్కలు..: తీరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేశాం. ప్రధానంగా వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా బీచ్‌రోడ్డులోని ఆహార ఉత్పత్తులు విక్రయించేవారికి అవగాహన కల్పించటంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించేలా చర్యలు చేపట్టాం.

అపార్టుమెంట్లు, హోటళ్లపై దృష్టి..: స్వచ్ఛ సర్వేక్షణ్ అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ. వీటిలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించటంతో పాటు ఎక్కువ తడి చెత్త ఉత్పత్తి జరిగే ప్రాంతాల్లో అక్కడే సేంద్రియ ఎరువుగా తయారు చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నాం. జోన్-3 పరిధిలో హోటళ్లు, అపార్టుమెంట్ల వద్ద నుంచి ఎక్కువ చెత్త ఉత్పత్తి జరుగుతోంది. అందువల్ల ఆయా హోటల్ యజమానులకు, అపార్టుమెంట్ వాసులకు అవగాహన కల్పించాలని నిర్ణయించాం. ప్రధానంగా అపార్టుమెంట్ల వద్ద సేంద్రియ ఎరువు సిద్ధమైతే ఆ ఎరువును మొక్కలు పెంచుకునేందుకు వారే ఉపయోగించవచ్చు. దీనిపై త్వరలోనే పెద్దఎత్తున అవగాహన కల్పించనున్నాం.

ముఖాముఖి


స్వచ్ఛతాహీ సేవలో భాగంగా పార్కు పరిశుభ్రత

సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే: పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలంటే సిబ్బంది అందుకు సన్నద్ధంగా ఉండాలి. ఇంటింటి చెత్త సేకరణలో ఎదురయ్యే సమస్యలపై దృష్టి సారించి, విధిగా ప్రతీ ఇంటికి వెళ్లి చెత్తను సేకరించేలా చూస్తున్నాం. సచివాలయ సిబ్బంది కూడా విధిగా తమ విధుల్లో సమయపాలన పాటించాల్సిందే. వారి సచివాలయ పరిధిలో వారికి కేటాయించిన సమయంలో తిరుగుతూ పారిశుద్ధ్య నిర్వహణను సమర్థంగా జరపాలి. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు. ఇకపై క్షేత్రస్థాయిలో అధికారులమంతా తిరుగుతూ నిరంతరం పర్యవేక్షణ చేస్తాం. హాజరు నుంచి విధులను ముగించి వెళ్లే వరకు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందే.

రేపు దయాల్బాగ్‌లో వస్తుప్రదర్శన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాలాక్షినగర్‌లోని దయాల్బాగ్ విద్యాకేంద్రం ఆవరణలో బుధవారం తోలువస్తువుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు. లెదర్ బూట్లు, చెప్పులు, బెల్టులు, హ్యాండ్‌బ్యాగ్‌లు, ట్రావెల్ బ్యాగ్‌లు, స్పోర్ట్స్ బూట్లు తదితర వస్తువుల ప్రదర్శన, అమ్మకం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా సహస్రనామార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి సోమవారం సహస్రనామార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. తులసీ దళాలతో సహస్రనామార్చన జరిపారు. అనంతరం అదే వేదికపై స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

రైతుబజారులో వ్యర్థాలు తొలగించారు

ఎంవీపీకాలనీ రైతుబజారులో ఏరోజుకారోజు చెత్త తొలగించాలని 'మేమున్నామని'లో వచ్చిన ఫిర్యాదుకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. వాహనాన్ని సమకూర్చి వ్యర్థాలను తొలగించారు.

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

స్పందనకు వందనం

గొయ్యి పూడ్చారు..

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ పరిధి 22వ వార్డు మంగాపురంకాలనీకి వెళ్లే మార్గంలో రహదారి మధ్యలో రంధ్రం పడటంతో ఆ ప్రాంత వాసులు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. రంధ్రం పూడ్చటంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.


రంధ్రం వద్ద మరమ్మతులు

గంటాను కలిసిన పీలా గోవింద్


పీలా గోవింద్‌ను అభినందిస్తున్న గంటా శ్రీనివాసరావు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. గంటా శ్రీనివాసరావు నివాసంలో ఆయనను గోవింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని మౌలిక సౌకర్యాల కల్పనకు పెద్ద పీట వేయాలని సూచించారు.

పదవీ విరమణ చేసినవారికి సత్కారం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సత్కరించారు. పోలీసు సమావేశ మందిరంలో సోమవారం పదవీ విరమణ చేసిన ఎ.సి.పి. శ్యామలరావు, ఆర్ఎస్ఐ ఆర్.వి.రమణ, ఎ.ఆర్.ఎస్.ఐ. కె.ఆనందరావులను వారి కుటుంబసభ్యుల సమక్షంలో సత్కరించారు. పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పదోన్నతులు పొందిన వారికి..

నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన ముగ్గురు ఆర్ముడు కానిస్టేబుళ్లకు ఏఆర్ హెచ్.సి.లుగా పదోన్నతులు లభించాయి. పదోన్నతులు పొందిన వారు కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. పదోన్నతులు పొందిన వారిని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ స్వయంగా అభినందించి, పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందజేశారు. జె.సి.పి. డాక్టర్ ఫకీరప్ప, ఏఆర్ అధికారులు పాల్గొన్నారు.


పదవీ విరమణ చేసిన వారిని సత్కరించిన సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఒప్పంద కార్మికులకు న్యాయం చేయాలి


ఎం.పి. భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు లక్ష్మీబాయి, తదితరులు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారంలోని 4290కి పైగా ఒప్పంద కార్మికులను స్టీల్‌ప్లాంటు యాజమాన్యం తొలగించిందని, వారందరికి న్యాయం జరిగేలా చూడాలని 75వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పులి లక్ష్మీబాయి, పలువురు కార్పొరేటర్లు ఎం.పి. భరత్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఒప్పంద కార్మికులను అర్ధంతరంగా తొలగించటం ద్వారా వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. దీనిపై స్పందించిన ఎం.పి. భరత్ మాట్లాడుతూ.. ఒప్పంద కార్మికుల విషయమై ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో చర్చించానని, కార్మికులను తొలగించవద్దని సూచించినట్లు తెలిపారు. ఎం.పి. భరత్‌ను కలిసిన వారిలో గాజువాక కార్పొరేటర్లు గంధం శ్రీను, పల్లా శ్రీను కాకి గోవింద రెడ్డి, శ్రీను, బోండా జగన్, ఎం.ముత్యాల, ఎల్.కోటేశ్వరరావులు ఉన్నారు.

వాకర్స్‌కు ఉచిత ఆరోగ్య పరీక్షలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : విశాఖ శాటిలైట్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం ఉదయం ఆళ్వార్‌దాస్ మైదానంలో మెడికవర్ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో భాగంగా రక్తపోటు, మధుమేహం, తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. హృద్రోగ నిపుణులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ సాయిచంద్, సంఘం అధ్యక్షులు పి.కిశోర్‌కుమార్, త్రినాథరావు, డాక్టర్ పప్పూర్ నికుంజ్, సత్యారావు, ప్రకాష్, ప్రభు, రాజశేఖర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్

స్థల విక్రయంపై అభ్యంతరం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధిలోని రవీంద్రనగర్‌లో ప్రజావసరాల కోసం వదిలిన స్థలాన్ని ఆ కాలనీ సంఘం ప్రతినిధులు కొందరు అమ్మేయటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రవీంద్రనగర్‌లో 400 గజాల స్థలం ప్రజావసరాల కోసం 40 ఏళ్ల క్రితం కేటాయించారు. అందులో 200 గజాల్లో 2009లో సామాజిక భవనాన్ని నిర్మించారు. మిగిలిన 200 గజాలు ఖాళీగా వదిలారు. ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించాలని ప్రయత్నించినా ఫలించలేదు. ఇపుడు ఆ స్థలాన్ని ఓ వ్యక్తికి రూ. 47 లక్షలకు అమ్మేయటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక అవసరాల కోసం వదిలిన స్థలం అమ్మేయటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ప్రజావసరాలకు కేటాయించిన స్థలం

2న ఖాదీ సంత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు పురస్కరించుకొని అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు ఖాదీ సంత ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో పలువురు భాజపా నాయకులు ఖాదీ సంతకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, కోశాధికారి ఎం.నాగేంద్ర, భాజపా సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌తో భాజపా నాయకులు

అతిథి ఉపన్యాసం నిర్వహణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో సోమవారం అతిథి ఉపన్యాసం జరిగింది. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపవరింగ్ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ అంశంపై అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైంటిస్ట్స్ (ఏఏపీఎస్) ఫెలో అవార్డు గ్రహీత, ఏయూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ బండి నగేష్ ప్రత్యేక ప్రసంగం చేశారు. అనంతరం ఆయనను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.గిరిజాశంకర్, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, ఆచార్య రమణమూర్తి, ఆచార్య ఎ.కె.ఎం.పవార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పుస్తకావిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగపు సహాయ ఆచార్యులు వి.క్రిస్టోఫర్ రచించిన 'కాంప్రిహెన్సివ్ అప్రోచ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' అనే పుస్తకాన్ని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పుస్తక రచయితను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, విభాగపు ఆచార్యులు ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంచేసి పచ్చదనం పెంపొందించాలి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం ఉదయం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో పర్యటించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం పెంపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పరిపాలన, సాంకేతిక, ప్రణాళిక విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కమిషనర్ రమేష్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షణ ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, రామరాజు పాల్గొన్నారు.


గురజాడ కళాక్షేత్రం ఆవరణను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

మత్తుకు చిత్తవకండి

ఆరిలోవ, న్యూస్‌టుడే: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యువసేన ఫౌండేషన్ సంస్థ సభ్యులు.. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని తెలుపుతూ మూషిక ఆకృతుల వేషధారణలతో సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులకు అర్థమయ్యేలా గంజాయి తీసుకుంటే వచ్చే అనారోగ్యాలు, చట్టపరంగా ఎదురయ్యే సమస్యలు వివరించారు.


మూషిక వేషధారణలతో మత్తుపై అవగాహన

విద్యార్థుల ర్యాలీ

కేఆర్ఎంకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ప్లాస్టిక్ వస్తువులను విడనాడాలని కోరుతూ కృష్ణా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్స విజయవంతం

ఆరిలోవ, న్యూస్‌టుడే: అండాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి 8 కిలోల బరువున్న ట్యూమర్‌ను వెలికితీశామని ఆరిలోవ హెల్త్ సిటీలో ఉన్న ఒమెగా ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మహిళ ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ మురళీధర్, డాక్టర్ శ్రీహర్ష, డాక్టర్ శృతి వైద్య బృందం పాల్గొంది.

ఏయూ ఆచార్యుడికి ఎక్స్‌లెన్సీ అవార్డు



ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయం గణిత శాస్త్ర ఆచార్యులు కెప్టెన్ డాక్టర్ ఎన్.రామకృష్ణకు జి.ఎస్.హెచ్.ఎస్.సి.ఎం. అకాడమీ సంస్థ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డు-2024ను ప్రదానం చేసింది. ఈ సన్మాన పత్రాన్ని ఆయన సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు చూపించారు. ఆయన అభినందించారు.

సీషోర్ వాకర్స్ కార్యవర్గ సమావేశం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వుడాపార్కులో అక్టోబర్ 2న జరిగే గాంధీ జయంతి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. సీషోర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సెక్రటరీ తిరుపతిరావు ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు తిమ్మారెడ్డి, న్యాయవాది కోదండరామ్‌తో పాటు సభ్యులు రవి, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త ఉన్న చోట కదా శుభ్రం చేయాల్సింది...

నగరానికి అత్యధికంగా సందర్శకులు వస్తుంటారు. వారికి ఏమాత్రం చెత్తా చెదారం లేని బీచ్‌ను చూపించాలని యంత్రాంగం బీచ్‌క్లీనింగ్ కోసం యంత్రాలను ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉంది. కానీ ఈ యంత్రాలు తక్కువ చెత్త ఉన్న ఆర్కేబీచ్‌లోనే పనిచేస్తున్నాయి. మరికొంత దూరం వెళ్తే జాలారిపేటలో చెత్త కుప్పలుగా పేరుకుపోయి ఉంది. ఆ వైపు దృష్టిపెట్టడం లేదు. అటు వైపు ఈ యంత్రాలను తరలించాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, విశాఖపట్నం


బాగున్న ఆర్కేబీచ్ వద్ద శుభ్రతా యంత్రం..


జాలారిపేటలో పేరుకుపోయిన చెత్త

ప్రయోగశాల ప్రారంభం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ సి.ఎస్.ఆర్. నిధులు రూ. 28 లక్షలు వెచ్చించి ఆధునికీకరించిన అనలిటికల్ కెమిస్ట్రీ ప్రయోగశాలను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు దివీస్ లేబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్.వి.రమణతో కలిసి సోమవారం ప్రారంభించారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య కె.బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.


ప్రయోగశాల శిలాఫలకాన్ని ప్రారంభించిన ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

ఏయూలో స్వచ్ఛతాహీ సేవ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సామాజిక బాధ్యతగా యూనివర్సిటీ ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహిత, మత్తు రహిత, స్వచ్ఛమైన ప్రాంగణంగా తీర్చిదిద్దుదామని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం.ఉమాదేవి, ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఆచార్య ప్రభాకర్, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెడ్డలో లభించిన మృతదేహంపై దర్యాప్తు

గురుద్వారా, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం 80 అడుగుల రహదారిలో పుష్పకబంగారం ఆలయం వెనుక గెడ్డలో మృతదేహం లభ్యమైన కేసుపై నాలుగో పట్టణ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. మృతదేహం గుర్తు పట్టలేనంతగా కుళ్లిపోవడంతో స్థానికుడా వేరే ప్రాంతానికి చెందిన వాడా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పై ప్రాంతాల్లో గెడ్డలో పడి కొట్టుకు వచ్చేందుకు అవకాశం ఉన్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో ప్రజలను ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎవరైనా సుమారు 40 ఏళ్లున్న వ్యక్తులు అదృశ్యమైతే నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

గురుద్వారా, న్యూస్‌టుడే

సమస్య: సీతమ్మధార సాయిబాబా మందిరానికి వెళ్లే రహదారి పూర్తిగా మరమ్మతులకు గురైంది. వాహన చోదకులకి ఇబ్బందులు తప్పడం లేదు.
–సత్యనారాయణ (స్థానికుడు)

జ: ఇటీవల కురిసిన వర్షాలకు మరమ్మతులకు గురైంది. నిర్మాణ పనులు చేపడతాం. – జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM విశాఖ ఉత్తరం: 80747 24699 విశాఖ దక్షిణం: 80085 66543

సీతంపేట, న్యూస్‌టుడే

సమస్య: విశాఖ పౌరగ్రంథాలయం ఆవరణలోని విద్యుత్తు దీపం చాలా రోజులుగా వెలగడం లేదు.
– ఈశ్వరరావు, స్థానికులు

అధికారి: రెండు, మూడు రోజుల్లో విద్యుత్తు దీపం వెలిగిస్తాం. – ప్రసాద్, ఏఈ, జీవీఎంసీ

37 కేజీల గంజాయి పట్టివేత

గురుద్వారా, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని ద్వారకా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఫరీద్ బహార్ మహ్మద్ ఒడిశాలో 37 కేజీల గంజాయిని కొనుగోలు చేసి మూడు సంచుల్లో రామాలయం దరి ప్రైవేటు బస్సులు నిలిపే ప్రదేశంలో సంచరిస్తున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేసి అరెస్టు చేశారు. సోమవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు

గురుద్వారా, న్యూస్‌టుడే: దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదని అర్బన్ తహసీల్దార్ రమేష్ అన్నారు. సోమవారం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి పరిశీలించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నరసింహనగర్ శివారు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆలయం అధ్యక్షులు టి.ఎస్.ఎన్.మూర్తి, ప్రధాన అర్చకులు ఏడిద గురునాథ శర్మ, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆలయం సన్నిధిలో వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, ఎం.రంగారావు, టి.వెంకటరావు, బి.కె.నాయుడు, పి.రామారావు, మహాలక్ష్మీ, వెంకటలక్ష్మీ, భక్తులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఏయూలో పుస్తకావిష్కరణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగపు సహాయ ఆచార్యులు వి.కిస్టోఫర్ రచించిన 'కాంప్రిహెన్సివ్ అప్రోచ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ' అనే పుస్తకాన్ని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పుస్తక రచయితను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, విభాగపు ఆచార్యులు ఆచార్య వి.సిద్ధయ్య, ఆచార్య జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.15వేల అందజేత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం రూ.15వేల ఆర్థిక సహాయం అందించింది. ఆ మొత్తానికి సరిపడే చెక్కును సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు అందజేశారు. సంఘం ప్రతినిధులు శివకుమార్‌రెడ్డి, నారాయణరావు, సత్యనారాయణ, అరుణ్‌కుమార్, కోటి, ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'నెయ్యి కల్తీపై స్వరూపానందేంద్ర స్పందించాలి'

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీపై విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్పందించాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో హిందువులు, స్వామిజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా స్వరూపానందేంద్ర సరస్వతి ఎందుకు స్పందించలేదో చెప్పాలన్నారు.

నూతన మద్యం విధానం రద్దుకు డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడడాన్ని మహిళా సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తోందని పీఓడబ్ల్యూ అధ్యక్షులు ఎస్.వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. కల్తీ మద్యం తాగి మరణించినా, మద్యం తాగి ప్రమాదాల్లో మరణించినా ప్రభుత్వ హత్యగా భావించాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలకు మద్యం నిధులు వినియోగించాలనుకోవడం సరికాదన్నారు. ఆందోళనలో పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు విమల, జిల్లా నాయకులు బేగం, ప్రభావతి, సత్యవతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

ఒక్క రోజులోనే అందరికీ అందేలా..

నేడే పింఛన్ల పంపిణీ

మాధవధార, న్యూస్‌టుడే

అక్టోబరు నెల సామాజిక పింఛన్లు ఒకటో తేదీనే నూరుశాతం పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాలతో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి యంత్రాంగం సిద్ధమైంది. ఈ మేరకు సోమవారం సచివాలయ ఉద్యోగులు బ్యాంకులకు వెళ్లి అవసరమైన నగదును ఉపసంహరణ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. సాంకేతిక సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు చేపట్టారు. ఉత్తర నియోజకవర్గంలో సుమారు 14,486 మంది లబ్ధిదారులకు సుమారు 6.02 కోట్ల మేరకు అందజేయనున్నారు.

* ఒక్క రోజులోనే నూరుశాతం పింఛన్లు అందేలా సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలను కేటాయించారు. ఒకవేళ వలస వెళ్లిన వారు, వివిధ కారణాలతో అందుబాటులో లేకపోతే మళ్లీ 3వ తేదీన అందజేస్తారు. 2వ తేదీ గాంధీ జయంతి ప్రభుత్వ సెలవు కావడంతో పంపిణీ ఉండబోదని అధికారులు తెలియజేశారు. ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించి, అదే రోజు తమకు కేటాయించిన లబ్ధిదారులకు అందజేసేలా ప్రణాళిక రూపొందించారు. ఒక్కో కార్యదర్శికి గరిష్ఠంగా 50 మంది లబ్ధిదారులను కేటాయించారు. సచివాలయాన్ని క్లస్టర్లుగా విభజించారు. అవసరమైన క్లస్టర్ మ్యాపింగ్ చేశారు.



గత నెలలో వృద్ధురాలికి పింఛను పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు, సచివాలయ సిబ్బంది

ఆలయంలో దీపారాధన

కంచరపాలెం, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా సోమవారం పంజాబ్ హోటల్ జంక్షన్ శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం వద్ద జనసేన నాయకులు దీపారాధన నిర్వహించారు. 53, 54వార్డుల జనసేన నాయకులు ఎన్.దివాకర్, వి.భాస్కర్, టి.మాణిక్యాలరావు ఆధ్వర్యంలో నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణం ధరించాలి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమికోన్నత పాఠశాల ఎన్.సి.సి. కేడెట్లు శిరస్త్రాణం ధరించడంపై సోమవారం పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'శిరస్త్రాణం ధరించండి.. ప్రాణ రక్షణ పొందండి' అన్న నినాదాలు చేశారు. బుల్లయ్య కళాశాల లా ఆచార్యులు షేక్ బాబు శిరస్త్రాణం ధరించని చోదకులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఎన్.సి.సి. అధికారి ఎం.ఎన్.వి. విశ్వనాథం, హవల్దార్ మహేంద్ర గోస్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు

స్వచ్ఛతాహీ సేవపై అవగాహన ర్యాలీ

మాధవధార, న్యూస్‌టుడే: నేషనల్ శాంపిల్ సర్వే(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతాహీ సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జ్ ఎస్.పళ్లంరాజు, గంగాధర్ మాట్లాడుతూ పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆర్‌అండ్‌బీ సేవా రహదారి, మాధవధార వుడాకాలనీ, కళింగనగర్ వరకు ర్యాలీ చేసి, అనంతరం ఈస్ట్ పార్క్ వరకు మానవహారం నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

రైతుబజారులో..

కంచరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక రైతుబజారులో సోమవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. బజారులో చెత్తాచెదారాలు తొలగించారు. ఈ కార్యక్రమంలో జోన్- 5 జెడ్సీ రాము, అసిస్టెంటు మెడికల్ అధికారి డాక్టర్ సునీల్, జనార్ధన్, శానిటరీ అధికారి సింహాచలంనాయుడు, ఎస్టేటు అధికారి కృష్ణమూర్తి, భాజపా నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రైతుబజారును శుభ్రం చేస్తున్న జెడ్సీ రాము తదితరులు

ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనాలు నిర్మించండి

కంచరపాలెం, న్యూస్‌టుడే: 48వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలని భాజపా ఫ్లోర్ లీడర్ గంకల కవిత సోమవారం ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. ఈమేరకు వార్డులో ఎక్కడెక్కడ భవనాలు అవసరమో వినతి పత్రంలో పేర్కొన్నారు. వార్డులో విద్యుత్తు లైట్ల సమస్య అధికంగా ఉందని సోలార్‌లైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వార్డంతా కొండవాలు కావడం, అంతా పేద, మధ్యతరగతి వారే నివాసాలు ఉండడంతో వారందరికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శ్రీభరత్‌కు వినతి పత్రం అందజేస్తున్న భాజపా ఫ్లోరులీడరు గంకల కవిత తదితరులు

నూకాంబిక ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

మురళీనగర్, న్యూస్‌టుడే : 49వ వార్డు జైభారత్‌నగర్ బర్మాక్యాంప్‌లో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 3నుంచి 12వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు అమ్మవారిని ప్రత్యేక అవతారాలలో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం అమ్మవారికి కలశస్థాపన, అఖండ దీపారాధన, విజయదుర్గా దేవి అమ్మవారి విగ్రహావిష్కరణ జరుపుతారు. ప్రతిరోజు అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకం, లలితాసహస్రనామం, ఖడ్గమాల, కుంకుమార్చనలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

ద్విచక్ర వాహనం దగ్ధం

మాధవధార, న్యూస్‌టుడే: కంచరపాలెం బర్మాక్యాంప్ శ్రీనివాస నగర్‌లో ఇంటి బయట పార్కింగ్ చేసిన ఒక ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు ఇంటి బయట హోండా యాక్టివా వాహనాన్ని ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో అది మంటల్లో తగలబడుతుంటే అగ్నిమాపక సిబ్బంది అదుపుచేశారు. కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీం వచ్చి వివరాలను సేకరించారు.



మంటల్లో తగలబడుతున్న ద్విచక్ర వాహనం

నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖ ఉత్తర నియోజక వర్గ స్థాయిలో ఆటల పోటీలు సోమవారం మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఆరు పాఠశాలల నుంచి సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. ఇందులో చదరంగం, యోగా, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ తబిత తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భాజపా నేత శ్యామల దీపిక ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.



మధురానగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఖోఖో ఆడుతున్న బాలికలు

నూతన కార్యవర్గం ఎంపిక

మురళీనగర్, న్యూస్‌టుడే : 'మానవ సేవే మాధవ సేవ' సంస్థ ప్రత్యేక సమావేశం సెక్టర్-6 శ్రీదేవి పార్కులో సోమవారం నిర్వహించారు. 2024-25 నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా డి.ప్రసాదరాజు, అధ్యక్షులు ఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులు కె.వి.ఎన్.ఎస్.ప్రసాద్, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి వై.త్రిమూర్తి, కోశాధికారి కె.వి.వర్మ, ఉపకోశాధికారి టి.వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా 18మందిని ఎన్నుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు ఎస్.భానుప్రకాష్ కొత్త కార్యవర్గం చేయబోయే సమాజసేవా కార్యక్రమాల నియమావళిని వివరించారు.



సమావేశంలో పాల్గొన్న కొత్త కార్యవర్గం

దేవస్థానం భూముల్లో రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు

మాధవధార, న్యూస్‌టుడే: మాధవధార కొండ చుట్టూ ఉన్న దేవస్థానం స్థలంలో రక్షణగోడను నిర్మించేందుకు దేవస్థానం అధికారులు సోమవారం పనులను ప్రారంభించారు. దీనిలో భాగంగా మాధవధార ఆలయానికి వెళ్లే గిరి ప్రదక్షిణ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న సింహాచలానికి సంబంధించిన స్థలంలో రక్షణగోడను నిర్మించేందుకు పొక్లెయిన్‌తో చదును చేశారు. దాదాపుగా కొండ చుట్టూ రెండు కిలోమీటర్ల మేర ఈ రక్షణ గోడ నిర్మించనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గతంలో కూడా రక్షణగోడను నిర్మించేందుకు ప్రయత్నించినప్పటికీ, కొంత మంది కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిపివేశారు. రెండు రోజుల క్రితమే సింహాచలం అప్పన్న స్వామి భూములకు సంబంధించిన 25 కేసుల్లో దేవస్థానానికి అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో పలుచోట్ల దేవస్థానం భూముల వద్ద రక్షణ గోడలు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



మాధవధార గిరి ప్రదక్షిణ రహదారికి ఆనుకొని దేవస్థానం భూమిలో రక్షణగోడ నిర్మాణానికి చదును చేస్తున్న సిబ్బంది

విజేతలకు బహుమతుల ప్రదానం

గురుద్వారా, న్యూస్‌టుడే: ఎక్స్‌ట్రా స్కూల్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన స్పెల్‌బీ, చేతి రాత పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో ఆదివారం బహుమతులు అందజేశారు. చార్టర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అనిరిబాన్ పాల్, జనరేషన్ యువ సంస్థ వ్యవస్థాపకులు బి.నరేశ్ కుమార్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు పి.లలిత బహుమతులు అందజేశారు. ఎక్స్‌ట్రా స్కూల్ సంస్థ ఏపీ ప్రతినిధి సూర్యప్రభ పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు

జీవీఎంసీకి 102 వినతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భీమిలిలో తన ఇంటి స్థలాన్ని ఆక్రమించడంతోపాటు, కాలువను సైతం కప్పేసి ఇళ్లు నిర్మించారని ఓ వ్యక్తి జీవీఎంసీ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. జీవీఎంసీకి ఆస్తి పన్ను చెల్లిస్తున్నానని, రసీదులు, ఇంటి దస్త్రాలు చూపించినా, జీవీఎంసీ సిబ్బంది గతంలో కూల్చేశారన్నారు. ఇప్పుడు అదే స్థలంలో మరో వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుంటే సహకరిస్తున్నారని తెలిపారు. గాజువాకలో రహదారి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మరో వ్యక్తి ఫిర్యాదు చేశారు. 86వ వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించడంలేదని స్థానికులు తెలిపారు.

* మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 102 వినతులు వచ్చాయి. మేయరు గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సంపత్ కుమార్ వాటిని స్వీకరించారు. జోన్-1కు 2, జోన్ 2కు 18, జోన్ 3కు 22, జోన్-4కు 7, జోన్-5కు 16, ఆరో జోన్‌కు 16, ఏడో జోన్‌కు ఒకటి, 8వ జోన్‌కు 7, ప్రధాన కార్యాలయానికి 13 చొప్పున వచ్చాయి.



వినతులు స్వీకరిస్తున్న మేయరు గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

దుర్గాలమ్మ ఆలయంలో దీపారాధన

పూర్ణమార్కెట్ (అల్లిపురం), న్యూస్‌టుడే: వైకాపా పాలనలో పుణ్యక్షేత్రాల్లో కూడా అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూర్ణమార్కెట్ దరి దుర్గాలమ్మ దేవస్థానంలో సోమవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ చేసిన తప్పును మాజీ సీఎం వై.ఎస్.జగన్, వైకాపా నాయకులు సమర్థించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు గోవింద నామస్మరణ చేశారు. ఈవో శేఖర్‌బాబు, వార్డు తెదేపా అధ్యక్షుడు బొచ్చ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

రాష్ట్ర స్థాయి అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల విద్యార్థినులు శ్రీప్రద, గమనిలు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -19 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైజీ, పీటీ ప్రవీణ్‌కుమార్ సోమవారం విద్యార్థినులను అభినందించారు. భీమిలిలో జరిగిన శిబిరంలో వీరు ఎంపికైనట్లు చెప్పారు.



ఎంపికైన విద్యార్థినులతో సిస్టర్ షైజీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీతల మూర్తియాదవ్

శాంతి ఆశ్రమం భూములను స్వాధీనం చేసుకోవాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 19వ వార్డులో కబ్జాదారుల చెరలో ఉన్న శాంతి ఆశ్రమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జనసేన పార్టీ కార్పొరేటరు పీతలమూర్తియాదవ్ కోరారు. సోమవారం కలెక్టర్ హరేంధిరప్రసాద్‌ను కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశ్రమం ఆవరణలో నిర్మించిన వాణిజ్య సముదాయాలను తక్షణమే తొలగించాలన్నారు. సీఆర్‌జెడ్-3 పరిధిలోకి ఇక్కడ భూములు వస్తాయని, వీఎంఆర్‌డీఏ ఉత్తర్వుల ప్రకారం ఖాళీ స్థలంగా ఉండాలని, హైకోర్టు సైతం యథాపూర్వక స్థితి కొనసాగించాలని ఆదేశించినా, ఇందుకు భిన్నంగా ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ఏయూ బ్యాడ్మింటన్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఏయూ అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక సోమవారం ఎంవీపీ స్పోర్ట్స్ ఎరీనాలో ప్రారంభమైంది. ఏయూ వ్యాయామ విభాగ డైరెక్టరు ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ ఏయూ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికలు అక్టోబరు 2వ వరకు ఇక్కడ జరుగుతాయన్నారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పల్లా శ్రీనివాస్, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య విజయమోహన్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు, అన్ని రంగాల్లోనూ రాణించాలని దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. సోమవారం 39వ వార్డు ఎంవీడీఎం పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ఆటలు ఆడారు. ఎంఈఓ పైడప్పనాయుడు, ప్రధానోపాధ్యాయులు శేషకుమారి, వార్డు కార్పొరేటర్ సాదిక్, జనసేన నాయకులు వేణు, తెదేపా అధ్యక్షుడు దానేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వీసీఎస్‌తో మత్స్యకారులకు భద్రత

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వెసెల్ కమ్యూనికేషన్ సిస్టం (వీసీఎస్)తో మత్స్యకారులకు భద్రత లభిస్తుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం, న్యూస్పేస్ ఇండియా సంస్థ సహకారంతో అందించిన వీసీఎస్ పరికరాలను బోట్లకు అమర్చే కార్యక్రమాన్ని సోమవారం చేపల రేవులో ఎంపీ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వీసీఎస్ ద్వారా నడి సముద్రంలో రెండు వైపులా మాట్లాడవచ్చన్నారు. అత్యవసర సమయంలో సహాయం కోసం ఎస్ఓఎస్ బటన్ ఉపయోగించవచ్చన్నారు. మత్స్యకారులకు సునాయాసంగా అర్థమయ్యేలా ఇంటర్ ఫేస్, జియో ఫెన్సింగ్ సిస్టం, వాతావరణ హెచ్చరికలు అందజేయవచ్చన్నారు. మత్స్యకారులు సముద్రంలో ఇబ్బంది పడితే నావిగేషన్ ఉపయోగపడుతుందన్నారు. మత్స్యశాఖ జేడీ విజయ, తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, బోటు ఆపరేటర్లు పాల్గొన్నారు.



ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని పరిశీలిస్తున్న ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జీ తదితరులు

నియోజకవర్గంలో 'ఈనాడు'

జ్ఞానాపురం, న్యూస్‌టుడే

✦ ఉదయం 11గంటలకు జీవీఎంసీ అధికారులతో దక్షిణ నియోజవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమీక్ష.

✦ ఉదయం 11 గంటలకు జ్ఞానాపురం దరి దేవమాత సొడాలిటీ సభ ఆధ్వర్యంలో దేవమాత జపమాల ప్రార్థనల కార్యక్రమం ప్రారంభం.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.39 కోట్లు


కానుకలు లెక్కిస్తున్న సేవా కార్యకర్తలు, సిబ్బంది

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో జరిగింది. ఈవో వేంద్ర త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు రూ.1,39,44,045 సమకూరినట్లు ఈవో తెలిపారు. దీంతో పాటు 53.200 గ్రాముల బంగారం, 8.650 కిలోల వెండి లభ్యమైనట్లు వివరించారు. ఈ మొత్తం ఆదాయం 28 రోజులకు సంబంధించినదిగా ఈవో తెలియజేశారు.

మద్యం దుకాణాల్లో గౌడలకు రిజర్వేషన్ హర్షణీయం


పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న సంఘం నాయకులు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: గౌడలకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమని ఉత్తరాంధ్ర గౌడ సంఘం కన్వీనర్ కామన వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. కాన్వెంట్ కూడలి దరి సంఘం కార్యాలయంలో సోమవారం ఉత్తరాంధ్ర జిల్లాల గౌడ సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సంఘం నాయకులు మార్గాన రామారావు, జెర్రిపోతుల ప్రసాద్, అత్తిలి శంకరరావు, నారాయణరావు, రేలంగి పెదబాబు, ఏవీఎస్ఎన్.మూర్తి, ఆనందరావు పాల్గొన్నారు.

శిరస్త్రాణం ఉన్నా.. తలకెక్కలేదు!!



శిరస్త్రాణం ధరించని వాహన చోదకులను అడ్డుకున్న పోలీసులు




వాహన చోదకులు శిరస్త్రాణం ధరించడం ఎంతో ముఖ్యమని పోలీసులు పదేపదే చెబుతున్నారు. తనిఖీలు చేసి హెచ్చరిస్తున్నారు. అయినా చాలా మంది పట్టించుకోవడం లేదు. సోమవారం మద్దిలపాలెం వద్ద హెల్మెట్‌లు ధరించని వారిని అడ్డుకొని కేసులు నమోదు చేశారు. అయితే.. శిరస్త్రాణాన్ని చేత్తో పట్టుకొని, వాహనానికి తగిలించి నిర్లక్ష్యం వహించిన పలువురు అప్పటికప్పుడు తలకు పెట్టుకోవడం గమనార్హం. వ్యక్తిగతంగా ఎవరి భద్రతకు వారే బాధ్యులన్న విషయాన్ని చాలా మంది విస్మరిస్తున్నారు.

– ఈనాడు, విశాఖపట్నం

గోరాపూర్-దార్లిపుట్ డబ్లింగ్ లైన్‌కు అనుమతులు


డబ్లింగ్ లైన్‌ను పరిశీలిస్తున్న సీఆర్ఎస్ బ్రిజేష్ కుమార్ మిశ్రా, తదితరులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: తూర్పు కోస్తా రైల్వే వాల్తేర్ డివిజన్‌లోని గోరాపూర్-దార్లిపుట్ సెక్షన్‌లో జరుగుతున్న డబ్లింగ్ పనుల్లో 12.649 కిలో మీటర్లుకు సీఆర్ఎస్ అనుమతి లభించిందని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించి ఈ అనుమతులు ఇచ్చారన్నారు. కొత్తవలస-కిరండూల్ లైన్‌లోని ఈ ప్రాంతంలో డబ్లింగ్ పనులు పూర్తి చేయడానికి వాల్తేర్ రైల్వే వ్యూహాత్మకంగా వ్యవహరించిందన్నారు. పూర్తయిన డబ్లింగ్ పనుల్లో 2 కిలో మీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మిగిలిన భాగమంతా ఒడిశా పరిధిలో ఉన్నట్లు తెలిపారు. ఈ లైన్ అందుబాటులోకి రావడంతో రైళ్ల వేగంతో పాటు ట్రాఫిక్‌ను పెంచుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గుండె దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ మయూక్ చౌదరి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: చినగదిలి హెల్త్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో సోమవారం ప్రపంచ గుండె దినోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ మయూక్ చౌదరి మాట్లాడుతూ.. గుండె వైద్యానికి కేర్ ఆసుపత్రుల్లో నూతన చికిత్సా విధానాలు, అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. రోగులు ఆసుపత్రి ఆవరణలోకి వచ్చిన దగ్గర నుంచి వారు కోలుకుని తిరిగి వెళ్లే వరకు ఆసుపత్రిలో మంచి వాతావరణం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రోగులు, వారి బంధువులు తమకు గల అనుభవాలను పంచుకున్నారు. అనంతరం కేక్ కోసి అందరికి పంచారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు వెంకటేశ్వరరావు, వీవీవీఎన్ఎమ్ కుమార్, రాకేష్ దుబ్బా, వైద్య బృందం పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రిసోర్స్‌పర్సన్లు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీలో రిసోర్స్‌పర్సన్ల (ఆర్‌పీ)గా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 3ఏళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఏపీ మెప్మా ఆర్‌పీ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. తదుపరి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమను సర్వీసు నుంచి తొలగించాలని జీవీఎంసీ పాలక మండలి సమావేశంలో చర్చించినట్లు తెలిపిందన్నారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మణి, మల్లీశ్వరి, జ్యోతి, వి.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత విశాఖ

పల్నాడు జిల్లా వినుకొండ లయోలా పాఠశాలలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి అండర్- 17 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో విశాఖ జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో బెస్ట్ స్కోరర్‌గా భరత్ సాయి (వైజాగ్) ఎంపికయ్యారు. విజేతలకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, వినుకొండ రూరల్


బాలుర విజేత వైజాగ్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ, తదితరులు

కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంస్థల్లో పొరుగు, ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. అంతకు ముందు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రయివేటీకరణ వేగంగా జరుగుతోందని, ఫలితంగా శాశ్వత ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవడమే కాకుండా నిరుద్యోగం మరింత పెరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అతి తక్కువ వేతనాలిచ్చి పనులు చేయించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్, పోర్టు, రైల్వే, కోరమాండల్, ఆర్టీసీ, డెయిరీ తదితర సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు, సీఐటీయూ నాయకులు వెంకటరెడ్డి, బి.జగన్, యు.రాజు, టి.నూకరాజు, పి.మణి పాల్గొన్నారు.

వివేకానంద సంస్థకు ఆటో అందజేత


సూరాడ అప్పారావుకు ఆటోను అందజేస్తున్న కంచర్ల రాంప్రసాద్, అన్నపూర్ణమ్మ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద సేవా సంస్థకు కేఆర్ బ్రహ్మం అండ్ సన్స్ సంస్థ తరపున కంచర్ల రాంప్రసాద్, కంచర్ల అన్నపూర్ణమ్మ ఆటో వితరణగా ఇచ్చారు. సోమవారం సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావుకు ఆటో తాళాలను అందజేశారు. ఆహార పదార్థాల తయారీకి అవసరమైన సామగ్రిని తీసుకురావడానికి, అన్నార్తులకు ఆహారం పంపిణీ చేసేందుకు దీన్ని వినియోగించనున్నారు.

ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని నిరసన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: [illegible] సందర్భంగా ప్రోత్సాహకాలు అందించాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద వారు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చినగదిలి, పెదగదిలి, ఆదవరం, సింహాచలం ప్రాంతాల నుంచి 42 మంది ఆశాలు [illegible] వెళ్లి సేవలందించామని గుర్తు చేశారు. యూనియన్ నాయకులు పి. మణి, పద్మ, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్రన్ సీ బోర్డు కమాండర్‌గా ఏడీజీ చేరిక


కోస్టుగార్డు సిబ్బందితో కరచాలనం చేస్తున్న డాన్ని మిఖాయిల్

సింధియా, న్యూస్‌టుడే: భారతీయ తీరగస్తీ దళం ఈస్ట్రన్ సీబోర్డు-విశాఖపట్నం కేంద్రానికి కమాండర్‌గా అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాన్ని మిఖాయిల్ బాధ్యతలు స్వీకరించినట్లు సోమవారం ఐసీజీ వర్గాలు తెలిపాయి. కోస్టు గార్డు రీజియన్(ఈస్ట్)కు ఫ్లాగ్ ఆఫీసర్‌గా పలు సామర్థ్య విధులను చేపట్టిన అనుభవం ఆయనకు ఉందన్నారు. తీరగస్తీ దళంలో వివిధ రకాల ఆపరేషన్లతో మౌలిక వసతుల కల్పనకు అడుగులు వేయనున్నట్టు వెల్లడించాయి. తొలుత ఐసీజీ విశాఖ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఐసీజీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్.ఐ.లకు బదిలీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో ఎస్.ఐ.లకు బదిలీలు జరిగాయి. నగరంలోని వివిధ స్టేషన్లకు వారిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ✶ జి.జ్ఞానేశ్వరి(విజయనగరం-2 స్టేషన్), వి.వేణుగోపాల్(డీటీఎఫ్, విశాఖ)ను మహారాణిపేట స్టేషన్‌కు, వై. విమలాదేవి(ఐఎంఎల్ డిపో, అనకాపల్లి), బి.చలంనాయుడు(పాలకొండ)ను సీతమ్మధార స్టేషన్‌కు, ఎం.మోహనరావు(మహారాణిపేట), వి.ఎల్.కరుణాలత(ఆముదాలవలస)ను గోపాలపట్నం స్టేషన్‌కు, ఈ.రామకృష్ణ(పొందూరు, శ్రీకాకుళం)ను, కె.నరసింహమూర్తి(విజయనగరం-1)ను గాజువాక స్టేషన్‌కు, జి.శ్రీనివాసరావు(అనకాపల్లి), ఎల్.మాధవి(శ్రీకాకుళం)ను పెందుర్తి స్టేషన్‌కు, బి.వెంకటరాజు(ఐఎంఎల్ డిపో-1, విశాఖ)ను కె.అనీల్‌కుమార్(ఇచ్ఛాపురం)ను భీమునిపట్నం స్టేషన్‌కు, ఆర్.శ్యామల (ఐఎంఎల్ డిపో-1), కె.ఎ.విజయ్ కుమార్(ఐఎంఎల్ డిపో-2), ఎస్.ముసలీనాయుడు (సీతమ్మధార స్టేషన్)ను ఈఎస్ టాస్క్‌ఫోర్స్, విశాఖకు, ఎల్.అరుణకుమారి(విజిలెన్స్, శ్రీకాకుళం)ను, పి.అప్పారావు(చోడవరం స్టేషన్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్, విశాఖకు, ఎ.రాజ్యలక్ష్మి(ఐఎంఎల్ డిపో, శ్రీకాకుళం)ను ఎస్‌టీఎఫ్, విజయవాడ, జి.రాజేశ్వరి(కోటపాడు పీఎంకె డిస్టలరీస్)ను డిస్టలరీ వింగ్‌కు బదిలీ చేశారు.

జీవీఎంసీ సంరక్షణలోని ఆవు మృతి

రూ.40వేల నష్టపరిహారం అందజేత


బాధితుడు పిన్నింటి మోహన్‌కు చెక్కు అందిస్తున్న పశువైద్యాధికారి కిషోర్‌కుమార్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ సంరక్షణలో ఉన్న ఆవు సోమవారం ఉదయం మృతి చెందింది. సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతోనే గోమాత మృతి చెందిందని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సంరక్షణ కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. పశువైద్యాధికారులు కిషోర్‌కుమార్, కిరణ్, సహాయ వైద్యాధికారి ప్రసాద్ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆవు మృతి చెందడానికి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం కారణమని మూర్తియాదవ్ ఆరోపించారు. తక్షణం ప్రధాన వైద్యాధికారి, పశువైద్యాధికారిపై సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని అదనపు కమిషనర్ సోమన్నారాయణ, కమిషనర్ సంపత్‌కుమార్‌కు తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం పశువైద్యాధికారితో చర్చలు జరిపి ఆవు యజమానికి నష్టపరిహారం ఇవ్వడంతోపాటు, ఐదుగురు సిబ్బందిని తాత్కాలికంగా నిలిపివేయాలని, మరొకరికి సంజాయిషి నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఆవు యజమాని పిన్నింటి మోహన్‌కు రూ.40వేల నష్టపరిహారాన్ని పశు వైద్యాధికారి కిషోర్‌కుమార్ అందజేశారు.

ఎట్టకేలకు ఇంటికి చేరిన కానిస్టేబుల్

పని ఒత్తిడి వల్లే ఎవరికీ చెప్పకుండా వెళ్లానని వెల్లడి

[illegible], న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా కనిపించకుండా పోయిన ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ కె.వెంకట నర్సింహమూర్తి ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. గత నెల 22వ తేదీన స్టేషన్‌లో విధులకు హాజరై తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ మేరకు పీఎంపాలెం స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రోజులు గడిచినా ఆచూకీ లభించక పోవడంతో ఆదివారం కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఆ కానిస్టేబుల్ సోమవారం రవీంద్రనగర్‌లోని ఇంటికి చేరుకోవడంతో పోలీసులు అతడిని విచారించారు. 'చాలా కాలంగా మహిళా స్టేషన్‌కు సంబంధించిన కోర్టు కేసులు నేనొక్కడినే చూడడం వల్ల పని భారం పెరుగుతోంది. దీంతో మానసిక ఒత్తిడికి గురై కోర్టు ఆవరణలో ఒకసారి కళ్లు తిరిగి పడిపోయాను. మానసిక ప్రశాంతత కోసం ఎవరికీ చెప్పకుండా తిరుపతి, విజయవాడ వెళ్లి వెంకన్న స్వామిని, దుర్గమ్మను దర్శించుకుని వచ్చాను తప్ప మరే ఇతర కారణాలు లేవు.' అని అతడు వివరించినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన


బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న సి.పి. శంఖబ్రత బాగ్చీ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: పోలీసు సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బాధితుల నుంచి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజాసమస్యల పరిష్కారవేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించటంలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు. గడువులోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎ.సి.పి.లు, సి.ఐ.లు వారి వారి కార్యాలయాల్లో ఉంటూ పలువురి నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం జరిగిన వేదికకు 96 మంది బాధితులు హాజరయ్యారు.

PUBLIC NOTICE

This is to inform the general public that one my client State Bank of India, SME Branch, Visakhapatnam intends to extend loan to Sri Akula Srinivasa Rao and he informed my client the original sale deed bearing No.862/1999, dated 22-07-1999 and original registered Gift deed vide Doc.No.66/2000 dated 21-01-2000, were lost and hence a complaint was lodged with the police and obtained a certificate starting that the same could not be traced out in spite of their best efforts. My client would like to proceed further for the issuance of the loan basing on the certified copies of the above referred documents and if any one has any objection regarding the said transaction the same shall be informed to the undersigned within **7 days** from the date of this publication else my client would proceed with the loan transaction and my client will not be responsible or liable for any claim made later on.

SCHEDULE

Item No.1: Doc. No.862/1999: All that part and parcel of the land measuring an extent of 350 Sq.yds in Plot No. 54 in Vivekananda Nagar layout in S.No.49/2, Patta No. 249 of Yendada Village, Visakhapatnam and is bounded as follows: **East:** Plot No.58, **South:** Government Forest, **West:** Plot No.50, **North:** Road.

Item No.2: Doc. No.66/2000: All that part and parcel of the land measuring an extent of 350 Sq.yds in Plot No. 54 in Vivekananda Nagar layout in S.No.49/2, Patta No. 249 of Yendada Village, Visakhapatnam and is bounded as follows: **East:** Plot No.58, **South:** Government Forest, **West:** Plot No.50, **North:** Road.

B. RAMA DEVI, Advocate
Plot No. 105, SVV Residency, Muralinagar, NGGO's Colony, Visakhapatnam.**Cell:8885896699**

PUBLIC NOTICE

This is to inform the general public that one of my client State Bank of India, SME Branch, Visakhapatnam intends to extend loan to Sri Akula Srinivasa Rao and he informed my client the original sale deed bearing Doc. No. 911/1992 dated 27-03-1992, was lost and the same could not be traced out in spite of his best efforts. My client would like to proceed further for the issuance of the loan basing on the certified copy of the above referred document and if any one has any objection regarding the said transaction the same shall be informed to the undersigned within **7 days** from the date of this publication else my client would proceed with the loan transaction and my client will not be responsible or liable for any claim made later on.

SCHEDULE (Doc. No.911/1992)

All that part and parcel of the land measuring an extent of 35.381 Sq.yds undivided and unspecified share out of the total extent of 743 Sq.yds along with a Flat bearing No.1 in ground floor with 926 Sft, in Dolphin Heights, in Plot No. 13, T.P. No. 25/71, Block No.1, T.S. No.76 of Waltair Ward, Visakhapatnam and is bounded as follows: **Site: East:** Plot No. 12, **South:** Plot No.7, **West:** 30 feet Road, **North:** Vacant site for Park. **Flat: East:** Flat No.2, **South:** Open set back space, **West:** Common corridor, **North:** Open setback space.

Flat No.1 in ground floor: East: Flat No.2, **South:** Open set back space facing Road, **West:** Common corridor, **North:** Open setback space facing park site.

B. RAMA DEVI, Advocate
Plot No. 105, SVV Residency, Muralinagar, NGGO's Colony, Visakhapatnam.**Cell:8885896699**

బాధ్యతలు స్వీకరించిన ఉక్కు సీఎండీ సక్సేనా


ఉక్కు అధికారులతో సమీక్షిస్తున్న నూతన సీఎండీ ఎ.కె.సక్సేనా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)గా మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్(మోయల్) సీఎండీ ఎ.కె.సక్సేనా సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉక్కు డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. కర్మాగారంలోని బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్)-2 (కృష్ణా)ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. తరువాత ఈడీ(వర్క్స్) సమావేశ మందిరంలో ఉక్కు ప్రధాన యూనిట్ల అధిపతులతో ఉత్పత్తి పెంపుపై చర్చించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎ.కె.బాగ్చి, ఎస్.సి.పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్, సీజీఎం(వర్క్స్), ఇతర సీనియర్ అధికారులు సక్సేనాతో కలసి కర్మాగార సందర్శనలో పాల్గొన్నారు.

నేడు సింహగిరిపై కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో మహాలయ పక్షం పూర్తి కావడంతో పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనం నిలిపివేయనున్నట్లు తెలియజేశారు.

డబ్బుల విషయంలో ఘర్షణ

హోంగార్డులపై వీధి విక్రయదారుల దాడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి కొంతమంది వీధి విక్రయదారులు హోంగార్డులపై దాడిచేసి గాయపరిచారు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లాకు చెందిన షేక్ రహీమ్, నగరానికి చెందిన హోంగార్డులు అనిల్, నూకరాజు ఆదివారం రాత్రి బీచ్‌రోడ్డులో సరదాగా గడిపేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ ఐస్‌క్రీమ్ విక్రయదారుడితో డబ్బుల విషయంలో గొడవ జరిగింది. తాము పోలీసులమని.. డబ్బులు అడుగుతావా అంటూ ఈ ముగ్గురు ఐస్‌క్రీం విక్రయదారుడిని నిలదీశారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. సమీపంలోని వీధి వ్యాపారులు అందరూ అక్కడకు చేరారు. వీరి మధ్య వాగ్వాదం పెరగడంతో ఈ ముగ్గురిపై విక్రయదారులు దాడిచేశారు.

జీవీఎంసీకి 49 మంది సంక్షేమ కార్యదర్శులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీకి కేటాయించిన సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు 49 మందికి సోమవారం కమిషనర్ పి.సంపత్‌కుమార్ నియామకపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలన్నారు. ఒక రోజు శిక్షణ ఇస్తామన్నారు. నియామకపత్రాలు పొందిన వారు మేయరు గొలగాని హరి వెంకట కుమారిని మర్యాద పూర్వకంగా కలిశారు. వైకాపా ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ స్వాతిదాసు పాల్గొన్నారు.


సంక్షేమ కార్యదర్శులతో మేయరు హరి వెంకట కుమారి

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	102	95
లైవ్	124	115
డ్రెస్డ్	180	200
స్కిన్‌లెస్	205	210

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం


బహుమతులు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు

నడుపూరు విద్యార్థుల ప్రతిభ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జాతీయ హిందీ దివస్ సందర్భంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ సంస్థ నిర్వహించిన హిందీ వ్యాస రచన, కవితా పఠనం పోటీల్లో నడుపూరు హైస్కూలుకు చెందిన విద్యార్థులు పతకాల పంట పండించుకున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో పలు పాఠశాలల నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనగా జూనియర్, సీనియర్ విభాగాల్లో నడుపూరు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. వారిని పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ అభినందించారు.

నూతన కార్యవర్గం నియామకం

కరాస, న్యూస్‌టుడే : గోపాలపట్నంలో ఉన్న శ్రీగౌరీ సేవాసంఘం మహిళ, పురుష విభాగాల్లో నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. గోపాలపట్నం గౌరీ సంఘం మహిళా కార్యవర్గం అధ్యక్షురాలిగా పొలిమేర జగదీశ్వరి, ఉపాధ్యక్షురాళ్లుగా పోలమరశెట్టి ఉమామహేశ్వరి, బుద్ద దేవీ తిరుమలకుమారి, కార్యవర్గ సభ్యులను నియమించారు. ★ పురుషుల కార్యవర్గం అధ్యక్షుడిగా సదరం శ్రీనాథ్, ఉపాధ్యక్షులుగా మళ్ల నరసింగరావు, పోలమరశెట్టి ఈశ్వరరావు, కార్యదర్శిగా పొలిమేర గురుప్రసాద్, కార్యవర్గ సభ్యులను నియమించారు.

భూ ఆక్రమణపై కలెక్టరుకు ఫిర్యాదు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస కాలనీలో గ్రామ దేవతకు చెందిన భూమి ఆక్రమణకు గురవుతోందని స్థానికులు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. పి.మణిబాబు, ఇ.అశోక్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక ఉద్యానవనానికి మురుగు కష్టాలు


హౌసింగ్‌బోర్డు పార్కులో మురుగు నీరు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే

వర్షాలు తగ్గుముఖం పట్టి వారం రోజులైనా 76వవార్డు హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉంది. బురద, వరద నీరు మడుగులు కట్టి ఉండడంలో పార్కులో అడుగుపెట్టడానికి వీల్లేకుండా పోతోంది. దీంతో ఆధునికీకరణ పనులు ఆగిపోయాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ముమ్మందు ముంపు కష్టాలు మరింత కలవర పరుస్తాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకుల్లగా నిరాదరణకు గురైన ఈ ఉద్యాన వనాన్ని మహావిశాఖ నగర పాలక సంస్థ నగరంలోని శివాజీ పార్కు తరహాలో 'అల్లూరి సీతారామరాజు పార్కు' పేరుతో ఆధునికీకరించడానికి నడుం బిగించింది.


వాకింగ్ ట్రాక్ దుస్థితి...

చిత్తడి..చిత్తడిగా..

★ జనావాసాల మధ్య 4.79 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఉద్యా నవనం ఉంది. గత వైకాపా ప్రభుత్వం అంచనాలు, ప్రతిపాదనల పేరుతో నాన్చుతూ వచ్చి ఉద్యానవనాన్ని గాలికి వదిలేసింది. ఇటీవల జోన్-6 ఇంజినీరింగ్ అధికారులు జీవీఎంసీ సాధారణ నిధులు రూ. 4కోట్లతో పనులు మొదలు పెట్టారు. ఇది పూర్తిగా లోతట్టు ప్రాంతం కావడంతో వర్షం వస్తే ముంపు సమస్య లేకుండా గ్రావెల్‌తో ఎత్తు పెంచారు. రోడ్డుకు నాలుగు అడుగుల మేర ఎత్తు పెంచడంతో భారీ వర్షాలు వచ్చినా వరద నీటి ముంపు బెడద ఉండదని భావించారు. సెప్టెంబరు 24, 26 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు మురుగు డ్రైనేజీలోకి వెళ్లకుండా ఉద్యానవనంలోకి చేరి ప్రాంగణాన్ని చిత్తడిగా మార్చింది.

★ ఇక్కడ వాటర్ ఫౌంటెయిన్, లాన్, 280 మీటర్ల పొడవైన 8 ఎలక్ట్రికల్ వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. 900 మీటర్ల స్కేటింగ్ రింక్, టెన్నిస్ లాన్, పిల్లల క్రీడా పరికరాలు, ఓపెన్ జిమ్, క్రికెట్ ప్లే గ్రౌండు, నెట్ ప్రాక్టీస్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్, పార్కింగ్, అవుట్‌సైడ్ ఫుట్‌పాత్‌లు, ఇంటర్ లాకింగ్ టైల్స్ నిర్మించారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టి: ఉద్యానవనం 90 పూర్తయిన దశలో వర్షపు నీరు నిలిచిపోవడంతో పనులు చేపట్టలేకపోతున్నారు. గుట్టలుగా పోసిన క్రషర్‌బుగ్గి, నిర్మాణ సామగ్రి, కొత్తగా నిర్మించిన పాత్‌వేలు కొట్టుకుపోయాయి. పనులు నిలిచిపోవడంతో ఎప్పటిలోగా ఉద్యానవనం పూర్తవుతుందో అనే ఆందోళన స్థానికుల్లో నెలకొంది. దసరా నాటికి దీన్ని ప్రారంభించాలని అధికారులు తొలుత నిర్ణయించారు. పరిస్థితి ఇలా ఉంటే మరో నెలరోజులు పట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. వరద ముంపు నుంచి ప్రత్యామ్నాయంగా ఎక్కడికక్కడ డ్రైనేజీ అవుటు లెట్లు, వరదనీటి కాలువల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఉక్కు కార్మికుల ఆకాంక్షను కాపాడతాం

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కార్మికుల ఆకాంక్షలు కాపాడేందుకు కృషి చేస్తున్నామని, ఒప్పంద కార్మికుల తొలగింపును వ్యతిరేకిస్తున్నట్లు విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. నగరంలోని ఆయన నివాసంలో పోరాట కమిటీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉక్కులో నెలకొన్న అనిశ్చితి, ఆర్థిక విధ్వంసం, ఉద్యోగుల కార్మికుల ఆందోళన, నష్టాల వైపు నెట్టే పరిస్థితిని నాయకులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఏడో తేదీ లోపు నూతన ఇంఛార్జి సీఎండీని కలిసి అన్ని అంశాలపై చర్చలు జరుపుతానన్నారు. కార్మికులు చేస్తున్న ఆందోళనను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల తొలగింపు, ఆర్థిక ఆంక్షలు ఈ సమయంలో అమలు చేయడం సరైన విధానం కాదన్నారు. ఈ మధ్య జరిగిన ఒప్పంద కార్మికుల తొలగింపుకు చేసిన కుట్ర కోణం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి దృష్టిలో లేదని ఈ విషయమై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, విళ్లారామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.అప్పారావు, మసేనురావు, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.


ఉక్కు పోరాట కమిటీ నాయకులతో విశాఖ ఎంపీ శ్రీభరత్

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

?: గాజువాక శివారు కూర్మన్నపాలెం ఫేజ్-2లో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు.
–రత్నమాల, కూర్మన్నపాలెం

✔: మీ ప్రాంతానికి సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేస్తాం.
–శివ, వీధి దీపాల నిర్వాహకుడు

?: గాజువాక వంటిల్లు కూడలి వద్ద ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీగా ఉంటోంది. బీటు కానిస్టేబుళ్లను ఉంచాలి.
– వరహాలరావు, కణితిరోడ్డు

✔: రద్దీ కూడళ్లలో బీటు కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.
– కోటేశ్వరరావు, సీఐ

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విజ్ఞాన్ విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, పీడీలు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. అండర్-20 విభాగంలో పి.సాయితేజ, కె.మోనాలి, ప్రణవశ్రీలు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ తెలిపారు. అక్టోబరు 4, 5, 6 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు హాజరుకానున్నారు. మరో నలుగురు విద్యార్థులు అండర్-23లో పోర్ట్ ఇండియా ఓపెన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులను ప్రిన్సిపల్ సుధాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ సతీష్, పీడీలు సీహెచ్. రాంబాబు, జె.ప్రశాంత్, పీఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఉద్ధృతం

1నుంచి మూడు రోజులపాటు ఆందోళనలు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ యత్నాలు నిలిపివేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, గనులు కేటాయించాలన్న డిమాండ్లతో మూడు రోజులపాటు ధర్నాలు, నిరసనలతో కేంద్రంపై ఒత్తిడి పెంచనున్నట్లు పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు 1327వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 1న విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టనున్నారు. 2న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్ద ధర్నా, 3న రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ దీక్షల్లో ఎల్ఎంఎంఎం, డబ్ల్యూఆర్ఎం, ఎస్‌బీఎం, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, సీతారామరాజు, ఆర్.ధనరాజు, రాజేశ్వరరావు, కర్రి బాబూరావు, దాసరి శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ

సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయండి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: అక్టోబర్2న విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట దీక్షా శిబిరం వద్ద ఆ రోజు నిర్వహించే సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని పోరాట కమిటీ నాయకులు కార్మికులకు పిలుపు నిచ్చారు. కర్మాగారంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు సత్యాగ్రహ దీక్ష గోడ పత్రికను ఆవిష్కరించారు. బుధవారం ఉదయం9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకూ దీక్షా శిబిరం వద్ద జరిగే సత్యాగ్రహ దీక్షల్లో ఉక్కు కార్మికులు, ఒప్పంద కార్మికులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, నీరుకొండ రామకృష్ణ, జె.అయోధ్యరామ్, గణపతిరెడ్డి, కామేశ్వరరావు, శ్రీనివాసనాయుడు, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


ఉక్కు సత్యాగ్రహ దీక్ష గోడపత్రికను ఆవిష్కరించిన నాయకులు

● ఇల్లు గడవడం కష్టమై కూలీ ఆత్మహత్య

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న కూలి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన ఎస్. నీలయ్య (45) అగనంపూడి దరి డొంకాడ కాలనీలో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఇటీవల పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఇల్లు గడవడం కష్టంగా మారడంతోపాటు చిన్న చిన్న అప్పులతో మనస్థాపానికి గురైై సోమవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతునికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

మల్కాపురం, న్యూస్‌టుడే: గత నెల 14 నుంచి 30వ తేదీ వరకు అసోంలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ టాలెంట్ హంట్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ప్రవల్లిక, అనుష్క పాల్గొని బంగారు, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. వీరు నగరంలోని కృష్ణ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. 63వ వార్డు జైఆంధ్రకాలనీ జైభీమ్ బాక్సింగ్ క్లబ్‌లో వీరు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు తదితరులు విజేతలను అభినందించారు.

● విద్యార్థికి ప్రత్యేక బహుమతి

కరాస, న్యూస్‌టుడే : కోనసీమకు చెందిన క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ సంస్థ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 29వ తేదీన కాకినాడ జేఎన్‌టీయూ, న్యూ సెంచరీ విద్యాలయంలో రాష్ట్రస్థాయి సృజనాత్మక కళల పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో 92వ వార్డు, హరిజన వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్.ఐశ్వర్య కొబ్బరిచిప్పతో తయారు చేసిన కళాకృతికి ప్రత్యేక బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.అప్పారావు, ఉపాధ్యాయురాలు డి.రమాదేవి, పాఠశాల సిబ్బంది ఆమెను అభినందించారు.

● విద్యుదాఘాతంతో గృహోపకరణాలు దగ్ధం

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి దిబ్బపాలెం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి విద్యుదాఘాతానికి ఓ ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కాలనీకి చెందిన చిప్పాడ నూకరాజు, సత్యవతి దంపతులు రాత్రి భోజనాలు చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో ఇంట్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. పక్కింట్లో నివాసం ఉంటున్న యలమంచిలి కనకారావు గమనించి అప్రమత్తం చేయడంతో నూకరాజు, సత్యవతి బయటికి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. కొద్దిసేపటికి ఇళ్లంతా మంటలు వ్యాపించి ఫ్రిజ్‌తో పాటు ఇతర సామగ్రి కాలిపోయింది. సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. స్థానిక కూటమి నాయకులు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

షిప్‌యార్డు మౌలిక వసతులపై రక్షణశాఖ సంతృప్తి

సింధియా, న్యూస్‌టుడే : హిందుస్థాన్ షిప్‌యార్డులో మౌలిక వసతుల కల్పనపై రక్షణ ఉత్పత్తుల కార్యదర్శి సంజీవ్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న కాలంలో సంస్థలో 4.0 సాంకేతికతను మరింత అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఈనెల 29న యార్డుని ఆయన సందర్శించి మాట్లాడారు. తొలుత యార్డులోని పలు విభాగాలను సందర్శించారు. 'హిందుస్థాన్ షిప్‌యార్డు' నమూనాలో సమగ్ర వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట సంస్థ సీఎండీ కమొడోర్ హేమంత్ ఖత్రీ, ఇతర డైరెక్టర్లు, అధికారులు ఉన్నారు.


షిప్‌యార్డు అధికారులతో సమావేశమైన రక్షణ ఉత్పత్తుల కార్యదర్శి సంజీవ్‌కుమార్

కైజెన్ పోటీల్లో అదానీ పోర్టుకు బహుమతి

గాజువాక, న్యూస్‌టుడే: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) సదర్ రీజియన్ నిర్వహించిన 19వ ఎడిషన్ నిరంతర అభివృద్ధి (కైజెన్)పోటీల్లో అదానీ గంగవరం పోర్టు (ఏజీపీ) మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా నగరంలో జరిగిన కార్యక్రమంలో పోర్టు యాజమాన్య ప్రతినిధులు పురస్కారం, జ్ఞాపికను అందుకున్నారు. వీరు మాట్లాడుతూ సామర్థ్యాలను ప్రదర్శించడంలో ఏజీపీ చూపిన ప్రతిభకు ఈ గుర్తింపు లభించిందని పోర్టు వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.


బహుమతి అందుకుంటున్న ఏజీపీ ప్రతినిధులు

ఒప్పంద కార్మికుల తొలగింపు తగదు

పెదగంట్యాడ(బీసీరోడ్డు), న్యూస్‌టుడే: స్టీల్‌ప్లాంటును పరిరక్షించాల్సిన యాజమాన్యం దొడ్డిదారిన ఒప్పంద కార్మికులను తొలగిస్తే సహించేది లేదని ఉక్కు అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. సోమవారం స్టీల్ ఇంటక్ ఆధ్వర్యంలో ఉక్కు బీసీగేటు వద్ద మహా ధర్నా నిర్వహించారు. జాతీయ ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఉక్కు ఇంటక్ ప్రతినిధులు నీరుకొండ రామచంద్రరావు, గొందేశి ప్రభాకరరెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు మాజీ సభ్యుడు బొడ్డు పైడిరాజు మాట్లాడారు. తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, అఖిలపక్ష నాయకులు కరందాసు వంశీకృష్ణ యాదవ్, రాజేశ్, శ్రీముసిరి శ్రీనివాస్, నమ్మిరమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు, అధికారులు

కరాస, న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డులో రూ.19.55 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను సోమవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. స్థానిక సుసర్ల కాలనీ వంశీ సూపర్‌మార్కెట్ నుంచి అమ్మవారి పాదాల వరకు గుంతలు పడి శిథిలావస్థలో ఉన్న తారురోడ్డు నిర్మాణ పనులకు ఈ నిధులు వినియోగిస్తామని ప్రజాపనుల విభాగం ఏఈ వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తెదేపా నాయకులు ప్రసాద్, అజయ్, మోహన్, లత పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంటు డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎన్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి, 45ఏళ్లలోపు వారు 3నెలల శిక్షణకు హాజరుకావచ్చన్నారు. ఆసక్తిగలవారు 91332 42666 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఏలేరు జలాలను కాపాడాలని వినతి

అగనంపూడి: నగర తాగునీటి అవసరాలు తీరుస్తున్న ఏలేరు జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అగనంపూడి ప్రాంత కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు అనకాపల్లి జెడ్పీ వి.అయ్యప్పనాయుడిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొప్పాక ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఏలేరు కాలువ నీటిలో వ్యర్థాలను వేసి కలుషితం చేస్తున్నారని తెలిపారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కూటమి నాయకులు బి.సత్యనారాయణ, వి.శ్రీను పాల్గొన్నారు.


జెడ్పీకి వినతిపత్రం అందజేస్తున్న కూటమి నాయకులు

తిరుమల పవిత్రతకు భంగం: జనసేన


కుంచమ్మ కాలనీలో దీపారాధన

గాజువాక, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రతకు భంగం కలిగేలా గత వైకాపా పాలకులు నెయ్యిని కల్తీ చేశారని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన కార్యకర్తలు సోమవారం సోమవారం రాత్రి వుడాకాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దీపారాధన నిర్వహించారు. జనసేన రాష్ట్ర నాయకులు గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, రౌతుగోవింద్, కోన చిన అప్పారావు, శివాజీ. సోమన్న తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరస్వామి ఆలయంలో...

సింధియా, న్యూస్‌టుడే : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం రాత్రి 58వ వార్డు కుంచమ్మకాలనీలో ఆ పార్టీ కార్యకర్తలు దీపారాధన నిర్వహించారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక దుర్గానగర్ దుర్గాదేవి ఆలయంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు సోమవారం ఆవిష్కరించారు. గాజువాక పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ అధ్యక్షుడు ఆకుల సూరి, నాయకులు కాతా బాలకృష్ణ, కండిపల్లి రమణ, సత్యనారాయణ, మాలకొండయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం'

గాజువాక, న్యూస్‌టుడే: ఉక్కు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాతగాజువాక తెదేపా కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపాతో కుమ్మక్కై కమ్యూనిస్టులు ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని, కార్మికులు ఈ చర్యలను తిప్పికొట్టాలన్నారు. నాయకులు రమణారెడ్డి, సోమునాయుడు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఒప్పంద కార్మికులను ఆదుకోవాలని వినతి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కులో 4వేల మంది ఒప్పంద కార్మికుల తొలగింపునకు యాజమాన్యం చర్యలు చేపట్టిందని, యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి తగిన న్యాయం చేయాలని తెదేపా కార్పొరేటర్ల బృందం సోమవారం విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను కోరింది. తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు లక్ష్మీబాయి, గంధం శ్రీను, లేళ్ల కోటేశ్వరరావు, కాకి గోవింద రెడ్డి, బొండా జగన్, మొల్లి ముత్యాలు, రౌతు శ్రీనులు ఎంపీతో చర్చించారు. స్టీల్ ప్లాంటులో ఒకేసారి ఇన్నివేల మంది రోడ్డున పడితే ఆ ప్రభావం కూటమి ప్రభుత్వంపై పడుతుందని, ప్లాంటు పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

వాకింగ్ ట్రాక్ వెంబడి బెంచీల ఏర్పాటు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: రావులు చెరువు వాకింగ్ ట్రాక్ వెంబడి సిమ్మెంటు బెంచీల ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. గాదావు సన్యాసి, ఎరకమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు కనకయ్య వాకర్ల సౌకర్యం కోసం ఆరు సిమ్మెంటు బెంచీలు సమకూర్చారు. వాకింగ్ ట్రాక్ వెంబడి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బెంచీలను సోమవారం ఆర్ఆర్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సూర్యభాస్కరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు భాస్కరరావు, ముత్యాలునాయుడు, దాత కనకయ్య పాల్గొన్నారు.


సిమెంటు బెంచీలు ప్రారంభిస్తున్న క్లబ్ ప్రతినిధులు

పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవ

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు జవహర్‌నగర్ స్వామి వివేకానంద పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు సోమవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ బాలురు, బాలికల విభాగం నుంచి కేడెట్లు చురుగ్గా పాల్గొని పాఠశాల మైదానంలో పెరిగిన గడ్డిని, వ్యర్థాలను తొలగించారు. పాఠశాల కరస్పాండెంట్ దాసరి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు

కూర్మన్నపాలెం (రాజీవ్‌నగర్), న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం 86వ వార్డు రాసాలమ్మ కాలనీలో సోమవారం నిర్వహించారు. భాజపా జిల్లా కార్యదర్శి బొండా యల్లాజీరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కె.నర్సింగరావు మాట్లాడుతూ గాజువాక పరిధిలోని 20వ వార్డుల్లో 14వేల సభ్యత్వం నమోదు చేసినట్లు తెలిపారు. భాజపా నాయకులు బొండా శ్రీదేవి, విజయ, రామాణారావు, బాబూరావు, డి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఏడు పాలాకుల చెట్లను తొలగించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్): జీవీఎంసీ పరిధిలో ఏడు పాలాకుల చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ జీవీఎంసీ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగులకు ఉద్యోగ మేళా



మాట్లాడుతున్న ప్రియరంజన్ తదితరులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సమాజంలో దివ్యాంగుల ఉపాధికి మెరుగైన అవకాశాలు ఉన్నాయని, వీటిని అందిపుచ్చుకోవడానికి తగిన శ్రద్ధ చూపాలని ట్రైన్ ట్రస్ట్ ఆలిండియా మేనేజర్ ప్రియరంజన్ అన్నారు. సోమవారం పెదగంట్యాడ గొడ్డువానిపాలెం కల్చర్ ఫౌండేషన్ కార్యాలయంలో దివ్యాంగులు, మహిళలకు జాబ్‌మేళా నిర్వహించారు. భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, ట్రస్ట్ సౌత్ ఇండియా మేనేజర్ సురేశ్ మాట్లాడారు. కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పేర్ల అప్పారావు అధ్యక్షత వహించారు. జాబ్‌మేళాలో మొత్తం 9 కంపెనీలు పాల్గొనగా 34మంది దివ్యాంగులు, 42మంది మహిళలను ఉపాధికి ఎంపిక చేసి ఆఫర్ లెటర్లను అందజేశారు.

● టెట్ పరీక్ష కేంద్రం పరిశీలన

గాజువాక, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం అక్టోబరు 3 నుంచి జరగనున్న టెట్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఈఓ చంద్రకళ ఆదేశించారు. పెదగంట్యాడ దయాల్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ పరీక్ష కేంద్రాన్ని సోమవారం ఆమె ఎంఈఓ రమణాజీతో కలిసి ఆమె పరిశీలించారు. కేంద్రం నిర్వాహకుడు జి.శ్రీనివాస్ తతదితరులు పాల్గొన్నారు.

● ఆర్.ఐ. బాధ్యతల స్వీకరణ

కరాస, న్యూస్‌టుడే : గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం నూతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా కె.కోమలి సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. కోమలిఅంతకు ముందు ఆమె మద్రిపాలెం పరిధిలో పౌర సరఫరాలశాఖలో సీనియర్ తనిఖీ అధికారిగా విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా గోపాలపట్నం ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్వో సీహెచ్ రమేష్, డిప్యూటీ ఎమ్మార్వో సువర్ణబాయ్, వీఆర్వోలు, సిబ్బంది ఆమెకి శుభాకాంక్షలు తెలిపారు.